# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 36 సంచిక 8

పేజీలు 40

ఏప్రియల్ 2017

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

భద్రవాక్యం ........................ 2
శ్రీబాబూజీ ఉవాచ ........................ 4
అమ్మమాట ........................ 6
కామాన్ని జయించటం ఎలా? ........................ 8
లక్ష్మీదేవి ........................ 9
పూర్ణమదః పూర్ణమిదం ........................ 11
కఠోపనిషత్ ........................ 12
త్రిపురా రహస్యం ........................ 14
కాటకూటేశ్వరుడు ........................ 16
తులసీదాసు రామదర్శనము ........................ 18
సనత్కుమార మహర్షి ........................ 19
అష్టాంగ యోగము ........................ 20
యోగవాశిష్ఠము ........................ 22
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు ........................ 24
పరిప్రశ్న ........................ 25
దైవసహాయం ........................ 27
వ్యర్థ జీవితం ........................ 28
శ్రీరాముడు మర్యాద పురుషోత్తముడు ........................ 29
శ్రీకృష్ణకర్ణామృతము ........................ 31
తత్త్వం తెలుసుకుందాం ........................ 32
ఎవరికి నేస్తం ఎవరు? ........................ 34
విశ్వామిత్రుడు ........................ 36
సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర ........................ 37
విష్ణు కథలు- మీరాబాయి ........................ 39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

**స్సబ్రహ్మ స్సశివః సేంద్రః సోక్షరః పరమఃస్వరాట్ ।**

**స ఏవ విష్ణుః సప్రాణః సకాలోగ్నిః స చంద్రమాః ॥**

(క్రైవల్యోపనిషత్ - 8వ శ్లో॥)

సగుణ నిర్గుణోపాసనలలో ఏ ప్రక్రియలోనైనా ధ్యానము ఏకాగ్రతతో కూడినదే కదా! అలాగే ఏ ఉపాసన అయినా భక్తి విశ్వాసములతో కూడినదే. కాబట్టి అనుభూతిలో మార్పు ఉండదు. ఏ అనుభూతి అయినా అక్షరమే. సగుణారాధనలో ఏ దేవతామూర్తిని ఆరాధించినా, ఆ మూర్తి గుణాతీతమైన బ్రహ్మమే కదా! పరతత్త్వం ఒక్కటే. ఏ వ్యక్తి ఏ రూపం ద్వారా ఆరాధించినా లేక ఒకే రూపాన్ని అనేక విశేష గుణాలతో ఆరాధించినా కాని అవన్నీ విశేష్యమైన ఒక పరమాత్మనే సూచిస్తాయి.

దశరథ కుమారుడన్నా, సీతాదేవి భర్త అన్నా, లక్ష్మణుడి అన్న అని ఆరాధించినా, రావణ సంహారకుడన్నా, హనుమంతుని ఇష్టదైవమన్నా అవన్నీ శ్రీరామచంద్రుని మాత్రమే సూచిస్తాయి కదా! మనమంతా ఆరాధించే వివిధ దేవతామూర్తులైన శివుడు, ఇంద్రుడు, విష్ణువు, ప్రాణము, కాలము, అగ్ని, చంద్రుడు వివిధ రూపాలతో వ్యక్తమయ్యే పరమాత్మయే అని గ్రహించాలి.

మానవులంతా వేరైనా అందరిలోనూ అనిత్యమైన పరిణామాలతో కూడిన దేహ మనోబుద్ధులు, ఇంద్రియాలను ప్రకాశించే పరమాత్మ మార్పు చెందనిది, నాశనము లేనిది.

మనదేహమందు అన్నమయకోశము ప్రాణమయకోశము చేత, ప్రాణమయకోశము మనస్సు చేత, మనస్సు బుద్ధి చేత, బుద్ధి వాసనచేత శాశింపబడుతున్నదన్న విషయం శాస్త్ర విదితమే. అందువలన సాధకుడు ఆత్మానుభూతిని పొందాలంటే బాహ్యమైన స్థూల శరీరాన్ని అధిగమించి, సూక్ష్మమైన అంతరంగంలో అన్వేషించుకుంటూ వెళ్ళగా చివరికి సూక్ష్మాతి సూక్ష్మమైన ఆత్మదర్శనం పొందగలుగుతాడు.

స్థూలమైన నామరూపాత్మక జగత్తు ద్వారా వ్యక్తమయ్యే ఆత్మ విరాట్ అని సంబోధించ బడుతుంది. చరాచర జగత్తులో నామ రూపాత్మకమైన ప్రపంచంలో ప్రతి ఒక్క వస్తువులోనూ అంతరాత్మగా వుండి, ఆ వస్తువును ప్రకాశింపజేసే, స్వయం ప్రకాశకమైన అంతరాత్మను స్వరాట్ అని సంబోధించవచ్చు.

పరమస్వరాట్ అంటే సూక్ష్మాతి సూక్ష్మమైన స్థూలమైన అన్నింటిని ప్రకాశింపజేసే అక్షరమైన అంతరాత్మ అన్నమాట. అదే ఎరుక. అనుభూతిని వ్యక్తం చేసే చైతన్యము. దానిని ఏ పేరుతో వ్యక్తము చేసినా పేరులో మార్పేగాని, ఉన్నది ఒక్కటి మాత్రమే అని గుర్తించాలి.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

ఏప్రియల్ 2017

05 బుధవారం - శ్రీరామనవమి,సా.5-30 ని॥లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన.

11 మంగళవారం - చైత్ర పూర్ణిమ; సా.5-30 ని॥లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన.

21 శుక్రవారం - శ్రీగురుదశమి; సా.5-30 ని॥లకు శ్రీ సద్గురు పాదపూజ.

30 ఆదివారం - శ్రీశంకరాచార్య జయంతి, ఉదయం11 గం॥లకు శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన.

మే 2017

10 బుధవారం -వైశాఖ పౌర్ణమి, సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

21 ఆదివారం - శ్రీగురుదశమి(హనుమజ్జయంతి) - ఉదయం 11 గం॥లకు సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

# శ్రీ బాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

'పూర్ణత్వం అంటే ఏమిటి? ఎవరు పూర్ణాధికారి?' అని ఒక భక్తునికి కలిగిన సందేహం నివృత్తి చేయుటం కోసం శ్రీ బాబూజీ మహరాజ్ బోధచేస్తూ "పూర్ణత్వం అంటే సద్గురుమూర్తి ప్రసాదించే అనుభూతి. అంతేగాని వేరొకరు ఇచ్చేదికాదు. లేక వేరొకవిధంగా పొందేది అంతకన్నాకాదు. నీలో ద్వైతభావం ఎప్పుడు రహితం అవుతుందో అప్పుడు నీ స్థితి పూర్ణస్థితే. సాధకుడు సుఖ దుఃఖాలు, రాగద్వేషాలు, నిందాస్తుతులు, మానాభిమానాలు గుర్తించినంతవరకు పూర్ణస్థితిని పొందజాలడు. చూడండి గణితశాస్త్రంలో వన్, డెసిమల్ వన్ అన్నా ఒకటికాదు కదా. కానీ వన్ మైనస్ వన్ అంటే పూర్ణమే అవుతుంది. ఉన్నదంతా ఒకటే అనబడే అనుభూతే పూర్ణస్థితి. నాకు భిన్నంగా ఏదీలేదు అనే భావనకాకుండా అనుభూతి పొందడమే దాని నిదర్శనము. మనస్సు ఆత్మలో లయమైనప్పుడు ద్వైతానికి తావులేదు కదా అదే పూర్ణస్థితి. అక్కడ ఆనందమే తప్ప ఇంక ఏదీ లేదు" అన్నారు.



శ్రీ బాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ "పూర్ణస్థితిని పొందడానికి సత్యగురువుని ఆశ్రయించవలసినదే. గురు శబ్దంలో 'గు' అంటే జీవ భ్రాంతి లేక అజ్ఞానము, 'రు' అంటే చైతన్యము లేక జ్ఞానతేజస్సు. కాబట్టి సత్యగురువు జీవుడిలో పేరుకొనిపోయిన జీవభ్రాంతి అనే అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞానమనే వెలుగుని ప్రసాదిస్తాడు. చీకటి వెలుగులో లయించిపోతుంది. సత్యగురువు పరమహంస స్వరూపుడు. ఆయనని 'మానవుడు' అనే దృష్టితో చూసినవారికి గురుతత్త్వము బోధపడదు. ఇక్కడ మీకొక దృష్టాంతము చెబుతాను.

ఒక మామిడిచెట్టు ఉందనుకోండి. భక్తుడు భక్తి శ్రద్ధలతో దాని ఫలాన్ని భగవంతునికి నివేదన చేసి భుజిస్తాడు. సాధకుడు ఆ ఫలాన్ని తాను ఆశ్రయించిన సద్గురుమూర్తికి ప్రేమతో అందిస్తాడు. ఆయన దానిని ఎంతో ఆనందంతో భుజిస్తాడు. చూశారా! ఆ మామిడిచెట్టు

భగవంతునికీ, మహాత్ములకీ ఎలా సద్వినియోగపడుతుందో, అదే మామిడిచెట్టు కింద విశ్రమించే అజ్ఞాని ఆ చెట్టు ఫలాలను భుజించి వెళ్ళిపోతూ ఆ చెట్టు కొమ్మని గాని రెబ్బనుగాని తుంటరితనంతో తుంపకుండా ఉంటడా? భగవానుడు మానవులందరికీ తమ స్థితిని తాము గుర్తించడానికి సమానమైన అవకాశాలు కలుగజేస్తాడు. ఆధ్యాత్మిక శక్తిని పెంపొందించుకోవడానికి జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, అంతరేంద్రియాలతో కూడిన దేహము అనే పరికరాన్ని అందజేయడమే కాకుండా తన స్థితిని తెలుసుకోవటానికి కావలసిన వేదాంత గ్రంథాలు, పురాణాలు ప్రసాదించారు.

అంతేకాకుండా భగవానుడు దయామయుడై తానే సగుణమూర్తిగా అవతరించి మహాత్ముల రూపంలో మానవులు తమ నిజస్థితిని గుర్తించడానికి చేయవలసిన సాధనని బోధల రూపంలో తెలియజేస్తున్నాడు. అంతేకాదు మానవులందరికీ ఏదో విధమైన కర్మను ఆచరించడానికి కావలసిన శక్తిని ప్రసాదిస్తున్నాడు. కొంతమంది వారి గాన మాధుర్యంతో ఆనందాన్ని అందిస్తున్నారు. మరి కొంతమంది వైద్యులై తమను ఆశ్రయించిన రోగులకు ఎంతో ప్రేమతో, వాత్సల్యంతో వారి బాధా నివృత్తికి కృషి చేస్తున్నారు. పరమాత్ముడు అటువంటి కర్మయోగులందరినీ అనుగ్రహించి గురుసాన్నిధ్యానికి చేర్చి వారిలో ఆధ్యాత్మిక శక్తిని పెంపొందిస్తున్నారు. సద్గురుమూర్తిని ఆశ్రయించిన కర్మయోగులు ఆయన అనుగ్రహానికి పాత్రులై గురు లక్ష్యార్థమును స్వీకరించి తమ నిజస్థితి గుర్తించగల్గుతున్నారు."

"నీవు గుర్తించిన వెలుగు లేక చైతన్యము నీలోనే ఉందా లేక నీ వెలుపల నుండి లోనికి వచ్చిందా? ఆ తేజస్సు సర్వత్రావ్యాప్తమై ఉంది. అంతేకాకుండా నీలోనూ ఉంది. ఆ తేజస్సే తానని గుర్తించడమే జ్ఞానము. అదే పూర్ణస్థితి. పరమహంస స్వరూపుడైన సద్గురుదేవులు తమ శిష్యులను ఆ స్థితికి చేర్చగలుగుతారు. అదే ఆత్మజ్ఞానము. అట్టి ఆత్మ సందర్శనం పొందినవాడికి ద్రష్ట, దర్శనము, దృశ్యము అనే త్రిపుటి ఉండదు. అందువలన ద్వైతమునకు తావేలేదు. శమాది షట్క సంపత్తి పొందిన భక్తుడు పూర్ణస్థితిని తప్పక పొందుతాడు" అన్నారు.

# అమ్మ మాట

- జపమాల ప్రసాద

## భజగోవిందమ్ మూఢమతే!

"ప్రపంచంలో ఏది సత్యం? శ్రీగురుదేవులిచ్చే అనుభూతి ఒక్కటే సత్యం. దానిలో మార్పు లేదు. గురుబోధని వినేటప్పుడు మిగతావన్నీ వదిలి పెట్టి, మనస్సు ఏకాగ్రత చేసి, వినాలి. అందుకే 'సన్యస్య శ్రవణం కుర్యాత్' అన్నారు. శ్రవణం నిజంగా చేసినట్లు మనకి ఎలా తెలియబడుతుంది? నేను మీలో ఒకరిని పిలిచి, 'బాబూ! దాహంగా ఉంది. ఒక గ్లాసు మంచినీళ్ళు తెచ్చిపెడతావా?' అని అడిగాననుకోండి. ఆ విన్న వాళ్ళు ఏం చేస్తారు? నాకు మంచినీళ్ళు తెచ్చిఇస్తారు. అవునా? అంటే నేను చెప్పినది వారు విన్నట్లు. వాళ్ళు కనుక నీళ్ళు తీసుకురాకుండా అక్కడే ఉన్నట్లయితే, వారు నేను చెప్పినది వినినట్లా? లేక విననట్లా?



అదే విధంగా మనం నిజంగా గురుబోధ శ్రవణం చేసినదానికి నిదర్శనం, వారు చెప్పినది తు.చ తప్పకుండా ఆచరించటమే. ఎన్నేళ్ళ నుండి వింటున్నా మన ప్రవృత్తిలో మార్పు రానప్పడు, మనం శ్రవణం చేసినా చేయనట్లే. మనస్సు ప్రాపంచిక విషయాలలోనే దొర్లుతుంటే, ఇక పవిత్రమైన గురుబోధ దానికి ఎలా అంటుతుంది? బోధ శ్రవణం చేసేటప్పుడు, ఇతర ఆలోచనలు, నిద్ర, కునికిపాట్లు ఎప్పుడు వస్తాయి? వినే విషయంపట్ల శ్రద్ధ లేనప్పుడు మాత్రమే అవి జరుగుతాయి. ఆసక్తి లేనప్పుడు నిద్ర వస్తుంది.

శ్రీగురుదేవులు తాము బోధామృతాన్ని అందించే ముందు శ్రీ తారక పరబ్రహ్మ ప్రసాద్, శ్రీ విజయేశ్వరానంద ప్రసాద్, శ్రీ లలితానంద సరస్వతీ స్వామినివారు, శ్రీ సుషుమ్నా ప్రసాదవారు - ఇత్యాది గురుభక్తుల చేత ఉపన్యాసాలు చెప్పించేవారు. మా చిన్నతనంలో అవేమీ తెలియక నిద్రపోయేవాళ్ళం. శ్రీబాబూజీ మహరాజ్ మొదలు పెట్టేవేళకి లేచేవాళ్ళం.

అది చిన్న వయస్సు అనుకోండి. శ్రీగురుదేవుల ఆజ్ఞమేరకే కదా వారందరూ ప్రసంగించడం జరిగింది. అలాగే పాదపూజ జరిగిన తరువాత శ్రీబాబూజీ ఆజ్ఞమేరకే ఇతరులు రక్ష పెట్టేవారు. చిన్నతనంలో అది తెలియక బాధపడే వాళ్లం. 'శివుని ఆజ్ఞలేనిదే చీమైనా కుట్టదు' అన్నట్లు 'గురుదేవుని ఆజ్ఞలేనిదే ఏమీ జరగదు' అని గుర్తుంచుకున్న నాడు ఒళ్లు మనస్సు దగ్గర పెట్టుకుని మసులుతాము.

వినడమే కాదు, చెప్పటం కూడా ఒక విద్య. మనం దేనిని నమ్మి, దేనిని అనుభవపూర్వకంగా తెలుసుకుంటామో అదే చెప్పాలి. చెప్పేది సారవంతంగా ఉండాలి. హృదయం ద్రవించేలాగ మాట్లాడాలి. చెప్పదలచి నది పొందికగా, మృదువుగా చెప్పడం నేర్చుకోవాలి. కేవలం గ్రంథాలు పఠించి వల్లెవేయడం వలన ఉపయోగం లేదు. ముందుగా గ్రంథాన్ని పరిశీలిస్తే నీ మనస్సులో మార్పు వస్తుంది. ఆ చదివిన దానిని నీ అనుభవం లోకి తెచ్చుకోవాలి. నీ అనుభవంలో తెలుసుకున్న దానిని యితరులకు చెప్పాలి. అప్పుడే అది విన్నవారి హృదయాలలో గుచ్చుకుంటుంది.

వినడమూ, చెప్పడమూ కూడా ఒక వాసన కాకూడదు. శ్రవణం లవణంలాగ చేయమన్నారు. కానీ ఆ శ్రవణం చేసిన దానిని నిరంతరం మననం చేసిననాడు అది మనకి నిదిధ్యాసకు వస్తుంది. గురుబోధని ఒళ్లంతా చెవులు చేసుకుని వినాలి; విన్నది హృదయంలో భద్రపరచుకుని దానిని రక్తం ద్వారా మెదడుకి అందించాలి. అప్పుడు మనం విన్న బోధని ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఎక్కడ కావాలంటే అక్కడ మననం చేసుకోవచ్చు. ఈ గురుబోధను మననం చేయటం వలన మనం మరణ రూపమైన సంసార సాగరం నుండి తరింపబడతాము.

కేవలం శాస్త్ర విషయాలు, వ్యాకరణ విషయాలు వల్లె వేయడం వలన మన అంత్యకాలమందు జనన మరణ మృత్యు సంసారము నుండి రక్షింపబడమని చెప్తూ శ్రీ ఆదిశంకర భగవత్పాదులవారు మనకి భజ గోవింద శ్లోకాలను అందించారు. వాటి గురించి రేపు చెప్పుకుందాం. కాబట్టి ఈనాడు చెప్పినది ఉపోద్ఘాతం మాత్రమే"

-సశేషం

# కామాన్ని జయించటం ఎలా?

- శ్రీరామ కృష్ణులు

పాములకు ఆవాసమైన ఇంట్లో నివసించేవారు వాటివల్ల ఏ కీడు మూడుతుందో అని అతి జాగ్రత్తగా ఉంటారు కదా? అలాగే సంసారులైన మానవులు కామినీకాంచనాలు తమను లోబరుచుకోకుండా మెలకువతో మెలగాలి.

పాము కంటపడినప్పుడు యిలా అనే అచారం ఉంది 'తల్లీ! మానసా! నీ తోకను మాత్రం కనబరుచు, తలను దాచుకుని దూరంగా తొలగిపో!' అలాగే కామోద్రేకాన్ని పురికొల్పే విషయ భోగాల నుంచి దూరంగా తొలగి నడచుకోవటమే తెలివైన పని. పతితులై తరువాత తెలివి తెచ్చుకోవటం కంటె వాటి సంసర్గం పొందకుండటమే మేలు.

ఒక వ్యక్తి వద్ద ఒక కుక్క ఉండేది. అతడు దానిని ఎంతో మక్కువతో పెంచుకోసాగాడు. అది చూచిన ఒక జ్ఞాని అతనిని మందలించాడు. ఎందుకంటె కుక్క జ్ఞానం లేని జంతువు కదా! అది కరిచే ప్రమాదం ఉన్నది. ఆ వ్యక్తి ఇక నుండి ఆ కుక్కను దరిచేరనివ్వ కూడదని నిశ్చయించుకున్నాడు. కాని ఆ కుక్క తన యజమాని దృష్టి మారిందని తెలియక తనను ఎప్పటిలాగే ప్రేమతో బుజ్జగిస్తాడని ఆశతో తరచు అతని చుట్టూ తిరిగేది. ఎన్నోసార్లు దెబ్బలు తిన్నది. చివరకు అది తనను లాలించమని యజమానిని బాధించటం మానేసింది. అలాగే కామం కూడా నీ దరికి చేరినప్పుడల్లా నువ్వు 'ఛీ' కొడుతూ ఉంటే కొన్నాళ్లకు ఆ కామం నిన్ను విడిచిపెట్టేస్తుంది!!


## వేసవిలో శిక్షణా తరగతులు!

1-5-2017 నుండి 31-5-2017 వరకు శ్రీకాళీగార్డెన్స్ నంబూరులో చిన్నపిల్లలకు వేసవి శిక్షణా తరగతులు ప్రార్థన, భగవద్గీత, ఉపనిషత్తులు మొదలగు అంశాలలో నిర్వహింప బడుతున్నాయి. ఆసక్తి గల తల్లిదండ్రులు విషయాన్ని గమనించి సద్వినియోగ పరచుకోగరు!

వివరములకు డా.అరుణ. సెల్ నం. 9346382563

# లక్ష్మీ దేవి

- పరాశర ప్రసాద్

శ్రీమన్నారాయణుడు నారదునికి లక్ష్మీదేవి పాలసముద్రంలో పుట్టిన వృత్తాంతాన్ని తెలియజేస్తూ "ఒకనాడు దుర్వాసుడు వైకుంఠము నందు హరిని పూజించి, హరి ప్రసాదముగా పారిజాత పుష్పమును తీసుకుని హరదర్శనార్థం కైలాసమునకు వెళ్తూ వెండికొండ పైన రంభతో స్వేచ్ఛా సంచారియైన ఇంద్రుని చూడటం తటస్థించింది.

ఐరావతం మీద నుండి క్రిందకు దిగి ఇంద్రుడు దుర్వాసునకు నమస్కరించాడు. దుర్వాసుడు సంతోషించి, తాను తెచ్చిన పారిజాతాన్ని ఇంద్రునికిచ్చి అది హరిప్రసాదంగా హెచ్చరించాడు. ఇంద్రుడు దానిని స్వీకరించి వెంటనే ఐరావతం కుంభస్థలంపై నిర్లక్ష్యంగా వుంచాడు. ఆ పారిజాత పుష్ప పరిమళానికి మత్తెక్కిన ఐరావతం అటుఇటు గంతులు వేస్తూ, దానిని తన తొండంతో తీసి క్రింద పడవేసింది.

అది గమనించిన దుర్వాసుడు ఆగ్రహించి ఇంద్రుని ఉద్దేశించి "ఓరీ మందమతీ! నీకు మేలు చేస్తుందని హరి పద పూజా పుష్పాన్ని నీకు అందజేస్తే నీవు దానిని ఆ పశువు నెత్తిమీద నిర్లక్ష్యంగా పడవేస్తావా? త్రిలోకాధిపతివన్న అహంకారమా? లేక మద్యపాన మదమా? హరికి నివేదన చేయకుండా భుజించే ఏ పదార్థమైనా విషప్రాయమవుతుంది కదా! హరిపద పూజా పుష్పాన్ని నిరశించిన నీ వైభవం నీళ్ళపాలవు గాక!" అని శపించాడు దుర్వాసుడు. దానితో ఇంద్రుని మత్తు వదిలిపోయింది.

ఇంద్రుడు దుర్వాసుని పాదాలపై పడి, చేతులు జోడించి, కన్నీరు కారుస్తూ శరణు కోరాడు. క్షమించమని మొరపెట్టుకున్నాడు. అప్పుడు దుర్వాసుడు శాంతించి, జ్ఞానబోధ చేస్తూ "ఎన్నో జన్మలెత్తి హరిభక్తుడవై ఆయన అనుగ్రహంతో ఈ స్థితికి వచ్చావు. రాజస, తామసాలకు తావివ్వక ఇప్పటికైనా హరిసేవ చేసుకుంటూ, నిశ్చల మనస్సుతో హరిని ధ్యానించు. తగిన ఫలితాన్ని పొందుతావు. నేను ఇంతకన్న నీకు చేయగలిగిన సహాయం లేదు" అని అక్కడ నుండి నిష్క్రమించాడు.

ఇంద్రుడు ఐరావతం అధిరోహించి, అమరావతి చేరుకునే సరికి

అంతా అసురమయమైంది. చేసేది లేక గురువైన బృహస్పతిని ఆశ్రయించాడు. సద్గురుమూర్తి అనుగ్రహంతో బ్రహ్మదేవుని ఆశ్రయించాడు.

బ్రహ్మదేవుడు ఇంద్రుణ్ణి మందలిస్తూ "బృహస్పతికి ముఖ్య శిష్యుడవై, అదితి కశ్యపుల పుత్రుడవై ఇంద్రియ నిగ్రహాన్ని కోల్పోయి ప్రవర్తించిన తీరు నిన్ను పదవీ భ్రష్టుణ్ణి చేసింది. ఆ హరిని ఆశ్రయించటం మినహా వేరు గతి లేదు" అని చెప్పిన మీదట అందరూ కలిసి శ్రీహరిని ఆశ్రయించారు. శ్రీహరి ప్రసన్నుడై ఇంద్రుని ఉద్దేశించి మాట్లాడుతూ "నా భక్తులను దూషించిన వారి ఇంట, అతిథులను ఆదరించనివారింట, లక్ష్మీకటాక్షము ఉండదు. ఇప్పుడు విచారించి ప్రయోజనం లేదు. పాల కడలిని మథించండి. దాని ద్వారా లక్ష్మి ఉద్భవిస్తుంది. తప్పక మిమ్మల్ని అనుగ్రహిస్తుంది వెళ్ళండి" అన్నాడు.

ఆ తరువాత ఇంద్రాదిదేవతలు అసురుల సహాయంతో మందర గిరి పర్వతాన్ని కవ్వంగా, వాసుకిని త్రాడుగా చేసి, క్షీరసాగరాన్ని మథించిన ఫలితంగా కామధేనువు, కల్పవృక్షము, లక్ష్మీదేవి ఆవిర్భవించటం జరిగింది. దేవతలు లక్ష్మీదేవిని శ్రీహరికి సమర్పించారు. ఆ దేవి అనుగ్రహంతో ఇంద్రాది దేవతలు శాపవిమోచనులై స్వస్థానాలను చేరి సిరిసంపదలతో కృతార్థులయ్యారు.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులు అయిన గరికపాటి శ్రీరామచంద్రమూర్తి (అస్సాం మూర్తి)గారు, 23-2-2017 గురువారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 91 సంవసత్సరాలు. సద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# పూర్ణమదః పూర్ణమిదం

- పాలూరి కాళీప్రసాద్ U.S.A

ఓం పూర్ణమదః పూర్ణమిదం। పూర్ణాత్ పూర్ణముదచ్యతే।
పూర్ణస్య పూర్ణమాదాయ। పూర్ణమేవావశిష్యతే॥

మామూలుగా ఈ శ్లోకం యొక్క అర్థాన్ని చూస్తే, అది పూర్ణం. ఇది పూర్ణం. పూర్ణం నుండి పూర్ణం ఉద్భవిస్తుంది. పూర్ణం నుండి పూర్ణం తీసివేసినా పూర్ణమే మిగులుతుంది - ఇది భగవంతుని యొక్క పూర్ణ తత్త్వాన్ని తెలిపే శ్లోకం. భగవంతుని నుండి ఈ ప్రపంచమంతా వుద్భవించినా ఆయన యొక్క పూర్ణత్వానికి ఏ లోటూ లేదని చెబుతుంది. కాని సామాన్య మానవాళికి ఇది అర్థం చేసుకోవటం కష్టం.

అందుకే శ్రీబాబూజీ మహరాజ్‌వారు దానికి ఇలా రెండు చక్కటి ఉదాహరణలు ఎప్పుడూ చెబుతుండవారు ......

"ఒక దీపం ఉన్నదనుకోండి. ఆ దీపం నుండి ఎన్ని దీపాలైనా వెలిగించు కోవచ్చు. ఒక దీపం నుండి వెలిగించిన మిగతా దీపాలన్నీ కూడా అంతే కాంతిని కలిగి వుంటాయి. కానీ ఇలా ఎన్ని దీపాలు వెలిగించినా, మొదటి దీపానికి వచ్చే లోపమేమీ లేదు. అది ఎప్పుడూ పూర్ణంగానే వుంటుంది.

అలాగే మనం ఒక అక్షరం చక్కగా నేర్చుకున్నామనుకోండి. ఆ అక్షరాన్ని మనం ఎంతమందికైనా నేర్పించవచ్చు. అలాగే మనం ఆ అక్షరాన్ని ఎన్నిసారులైనా వాక్కు ద్వారా, వ్రాత ద్వారా వుపయోగించ వచ్చు. కానీ మనలో ఇమిడిపోయిన ఆ అక్షరానికి ఎటువంటి లోటూ రాదు. అది ఎప్పుడూ పూర్ణంగానే మనలో నిలిచిపోయి వుంటుంది."

(గత సంచిక తరువాయి) # కఠోపనిషత్ - రమణ ప్రసాద్

నచికేతుడు - ధర్మం అధర్మం; కార్యం కారణం; భూతకాలం భవిష్యత్కాలం - వీటినుండి భిన్నంగా ఉన్నదానిని గురించి నాకు చెప్పు.

యమధర్మరాజు - అన్ని వేదాలు ఏ లక్ష్యాన్ని ఉపదేశిస్తున్నాయో, ఎందుకోసం అందరూ తపస్సులు చేస్తున్నారో, ఏది కోరి బ్రహ్మచర్యాన్ని పాటిస్తున్నారో, ఆ లక్ష్యాన్ని పొందే మంత్రాన్ని నీకు క్లుప్తంగా చెబుతున్నాను. అది "ఓం" అనే మంత్రం. "ఓం' అనే మంత్రమే భగవంతుడు. ఈ మార్గం సర్వోత్కృష్టమైనది. ఈ మార్గంలో వెళ్ళేవాడు బ్రహ్మలోకాన్ని పొందుతాడు.

ఆత్మ జన్మించటం లేదు, మరణించటంలేదు. అది దేనినుంచీ రూపొందినది కాదు. అది జన్మ రహితము, శాశ్వతము అయినది. శరీరం నశించినా నశించనది. ఆత్మ చావదు. చంపబడదు. అణువుకన్నా అణువైనది, అత్యంత పెద్దదాని కన్నా పెద్దదైనది అయిన ఈ ఆత్మ అన్ని ప్రాణుల హృదయగుహల్లో కొలువై ఉన్నది. ఆత్మ శరీర రహితమైనది, శాశ్వతమైనది, సర్వత్రా ఉన్నది. ఆత్మ రథికుడు; శరీరం రథం; బుద్ధి సారథి; మనస్సు కళ్లెం; ఇంద్రియాలు గుఱ్ఱాలు; విషయవస్తువులు ఆ గుఱ్ఱాలు వెళ్లే మార్గాలు. శరీరం, ఇంద్రియాలు, మనస్సు - వీటితో కూడిన జీవుడు జీవితాన్ని అనుభవించేవాడు. ఎవడు జాగృతి చెందినవాడో, ఎవడు ఇంద్రియ నిగ్రహం కలవాడో అతనికి ఇంద్రియాలు సారథి వశంలో వున్న గుఱ్ఱాల వలె వశంలో ఉంటాయి.

ఇంద్రియాలకన్నా విషయవస్తువులు శక్తివంతమైనవి; విషయవస్తువులకన్నా మనస్సు శక్తివంతమైనది; మనస్సుకన్నా బుద్ధి శక్తివంతమైనది; ఆతమ బుద్ధికన్నా శక్తివంతమైనది; ఆత్మకన్నా అవ్యక్తం శక్తివంతమైనది; అవ్యక్తంకన్నా భగవంతుడు శక్తివంతుడు. భగవంతునికన్నా శక్తివంతమైనది ఏదీ లేదు. ఆయనే పరమ వస్తువు. ఈ ఆత్మవస్తువు అన్ని జీవులలో దాగి ఉంది. బయటకు ప్రకటితంకాదు. కాని ఏకాగ్రమైన బుద్ధి ద్వారా మహాత్ములు ఆత్మను దర్శించ గలుగుతున్నారు. ముందుగా వాక్కును మనస్సులో లీనం చేయాలి; మనస్సును జాగృతి చెందిన బుద్ధిలో లీనం చేయాలి; బుద్ధిని ఆత్మలో లీనం చేయాలి; ఆత్మను భగవంతునిలో లీనం చేయాలి.

**ఉత్తిష్టత, జాగ్రత, ప్రాప్యవరాన్ నిబోధత** - లేవండి! మేల్కొనండి! అర్హుడైన గురువును ఆశ్రయించి అనుభూతిని పొందండి. ఇంద్రియాలు

నిగ్రహించే శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలన్నిటికీ అతీతమైన బుద్ధికన్నా శ్రేష్టమైన భగవంతుడిని గ్రహించి మరణాన్నుండి విడివడండి!

అమరత్వం కోరేవాడు ఇంద్రియాలను నిగ్రహించి, అంతర్ముఖుడై ఆత్మను చూడగలుగుతాడు. మనోపరిపక్వత లేనివాడు మృత్యుకూపంలో పడిపోతాడు. రూపము, రంగు, వాసన, శబ్దము, స్పర్శ మొదలైనవాటిని దేనితో మనిషి గ్రహిస్తున్నాడో, దానిని అదుపులో పెడితే  ఇంద్రియ వ్యాపారం అంతా మనస్సులో లీనమవుతుంది. తర్వాత మనస్సు మాట్లాడుతుంది.  మనస్సును నియంత్రించాలంటే బుద్ధిని మేల్కొలపాలి. బుద్ధి ద్వారా ఆత్మను గుర్తించాలి. అదే నువ్వు అడిగిన వస్తువు. స్వప్న జాగ్రదవస్థలలో దేనిచే అన్ని విషయాలు గ్రహిస్తున్నాడో అదే ఆత్మ.  దానిని గ్రహించినవాడు శోకంనుండి విడివడతాడు. కర్మ ఫలాలను అనుభవించే ప్రాణానికి ఆధారమైన ఆత్మను దగ్గరగా ఉన్నట్లు, ఆ ఆత్మ భూత భవిష్యత్కాలాలకు నేత అని తెలుసుకున్నవాడు ఎవరినీ ద్వేషించడు. అదే నువ్వు అడిగిన వస్తువు. ఎవరు పంచ భూతాలకన్నా ముందు పుద్భవించారో, ఎవరు ప్రాణుల హృదయ గుహలో ఉన్నారో, అదే నువ్వు అడిగిన వస్తువు. ప్రాణరూపమైనది, సమస్తదేవతల రూపమైనది, పంచ భూతాలతో ఉద్భవించినది, ప్రాణుల హృదయాలలో  ఉన్నదో అదే నువ్వు అడిగిన వస్తువు.

గర్భవతులైన స్త్రీలలో పెరిగే పిండంలాగా, కట్టెలలో అగ్నిలాగా ఆత్మ మన శరీరంలో మండుతూ ఉంటుంది. జాగృతి చెందిన యోగులు ఈ ఆత్మాగ్నిని అనునిత్యం దర్శిస్తూ ఉంటారు. ఆ ఆత్మాగ్నే నువ్వు అడిగిన వస్తువు. ఎవరివల్ల సూర్యుడు ఉదయిస్తున్నాడో, ఎవరివల్ల అస్తమిస్తున్నాడో, అన్ని లోకాలకు వెలుగును ప్రసాదించే భగవంతుడే నువ్వు అడిగిన వస్తువు.

**"యదేవేహ తదముత్ర, యదముత్ర తదన్విహ"** ఇక్కడ ఏది వున్నదో అదే అక్కడ ఉన్నది. అక్కడ ఏది ఉన్నదో అదే ఇక్కడ ఉన్నది. ఈ పరతత్వాన్ని చూడగలిగినప్పుడే అతడికి బ్రాహ్మీస్థితి లభిస్తుంది. సర్వత్రా వెలసి వున్నవాడు, భూత భలిష్యత్కాలకు ప్రభువు హృదయగుహలో బొటనవేలు పరిమాణంలో కొలువై ఉన్నాడు. ఆయనను తెలుసుకుంటే ఇంక ఎవరినీ ద్వేషించం- నువ్వు అడిగిన వస్తువు అదే.

- సశేషం

(గత సంచిక తరువాయి) # త్రిపుర రహస్యం - రమణ ప్రసాద్

## జ్ఞాన ఖండం

"దశార్ణ దేశాన్ని ముక్తా చూడుడు అనే రాజు పాలించేవాడు. అతనికి హేమచూడుడు, మణిచూడుడు అని ఇద్దరు పుత్రులు ఉన్నారు. ఒకరోజు ఆ ఇద్దరూ అడివికి వేటకు వెళ్ళారు. అప్పుడు ఒక పెద్ద సుడిగాలి వచ్చి ఇద్దరూ విడిపోయారు. హేమచూడుడు ఒక ఋష్యాశ్రమం చేరాడు. అక్కడ ఒక కన్యను చూశాడు. ఆమెను 'నీపేరేమిటి?' అని అడుగగా, ఆమె, 'నేను వ్యాఘ్రమహర్షి ధర్మ పుత్రికను. విద్యుత్ప్రభ అనే విద్యాధర వంగ దేశపు రాజైన సుషేణుని వల్ల గర్భవతి అయింది. ఆమెకు తన భర్త తలపుకు రాగా నన్ను వదలి వెళ్ళగా, వ్యాఘ్రపాద మహర్షి నన్ను పెంచాడు' అన్నది. ఆ మహర్షి అనుమతితో హేమచూడుడు ఆమెను వివాహం ఆడాడు. ఆమె స్థితప్రజ్ఞ.



భార్య తనపైన విరక్తి చూపుతున్నది అని సందేహించిన రాజ పుత్రుడితో, 'నాకు నీపైన విరక్తి లేదు. లోకంలో ఏది ప్రియమైనదో? ఏది అప్రియమైనదో నాకు నిర్ధారణగా తెలియలేదు. దానిని వివరించ'మని అడిగిన హేమలేఖతో, "దేని వలన దుఃఖం కలుగుతుందో అది అప్రియము. దేననివలన సుఖం కలుగుతుందో అది ప్రియం" అన్నాడు హేమచూడుడు. హేమలేఖ, "ఒకే వస్తువు సుఖము, దుఃఖం కలుగజేస్తుంది. అగ్ని వేసవిలో అప్రియం. చల్లని దేశంలో ప్రియం అవుతోంది. అన్నీ ఉన్న నీ తండ్రి ఏ విషయంపై దుఃఖం పొందుతున్నాడు? ఆయన వద్ద సుఖసాధనాలన్నీ ఉన్నాయి కదా! శరీరం బాగా కాలినప్పుడు కొద్దిపాటి గంధం చల్లబరుస్తుందా? నాలో సౌందర్యాన్ని చూసి ఆనందం పొందుతున్నావు. నా కంటే వికృతంగా ఉన్న స్త్రీలను చూసి ఇతరలు అంతటి ఆనందాన్నే పొందుతారు. మానవుడు చూసే సౌందర్యం మానసికమే."

"శరీరం అంటే మాంసం, రక్తం, శిరలు, చర్మం, ఎముకలతో

పిత్తమయం, కఫమయం, శుక్ల శోణితాలతో కూడినది. ఇట్టి శరీరంపై మానవుడు ఆసక్తి చూపిస్తున్నాడు. ఎంత వింత?" అన్నది. ఈ మాటలు విన్న హేమచూడునికి వైరాగ్యం కలిగింది. విషయ సుఖాలపైన అసహ్యం పుట్టింది. "చితియే" ఆత్మ. జ్ఞానానికి వ్యతిరేకమైనదంతా అనాత్మయే. బాల్య కౌమార యవ్వన వార్థక్యాది అవస్థలలోను, జాగ్రద్ సుషుప్త్యాదులలోను అనుగతంగా ఉన్నవాడను నేనే. భూత వర్తమానకాలములలో ఉన్నవాడను నేనే. అనగా "నేను" అనే ఆత్మ ఒక్కటే. అది చితిమాత్ర రూపమే(ప్రజ్ఞానమే దాని రూపం).

అన్ని దేహాలలో ఉన్న చితిరూపమైన ఆత్మ ఒక్కటే. చితికంటే దేశకాలాదులలో ఉనికియే లేదు. ఈ చిదేకరసమైన ఆత్మతత్త్వాన్ని శాస్త్రాలు "శివుడు" అంటున్నాయి. ఆ శివునికి శక్తి ఉన్నది. అది సర్వస్వతంత్రమైనది. దానినే "మాయ" అంటున్నాయి. ఆ మాయ ఘటనాఘటన చతుర. ఆ మాయ అవిద్యారూపమైన మలాన్ని(దోషాన్ని) భాసింపజేసి ప్రపంచాన్ని ద్వైతంగా భాసింపజేస్తుంది. ఈ ప్రపంచం శివుడి నుంచి ప్రారంభం కాలేదు. శివునిలో ఏ మార్పు లేదు. త్రాడు పాముగా కనిపించటాన్ని వివర్తం అంటారు. చితి, చైత్యము(కనిపించే ప్రపంచం) భిన్నాలుగా కనపడుతున్నాయి. రజ్జువు సర్పం వలె అభిన్నం కాదు. అద్దానికి ఉండే నిర్మలత అనే శక్తి చేత ఒక బింబం అద్దంలో ప్రతిబింబమవుతోంది. అద్దంలో మార్పు లేదు.

చితియందు తన స్వాతంత్ర్య శక్తి చేత,చైత్యము (ప్రపంచము) ప్రతిబింబిస్తోంది. ప్రతిబింబాలు అన్నీ దర్పణాత్మకాలే. అద్దం లేకపోతే ప్రతిబింబాలు లేవు కదా! అలాగే దృశ్యములన్నీ, అన్నిటిలో ఉన్న చితిని ఆశ్రయించియే ప్రకాశిస్తున్నాయి. మరి ఆ చితి ఎవరిని ఆశ్రయించి ప్రకాశిస్తోంది అంటే అది చిదాత్మయే చిత్స్వరూపమే అవటంచేత అది స్వయంప్రకాశం.

**'మాయాకల్పిత దేశకాలకలనా వైచిత్ర్యచిత్రీకృతమ్'**

**'బాల్యాదిష్వపి జాగ్రదాదిషు తథా సర్వవస్థాస్వపి'** దక్షిణామూర్తి స్తోత్రం లోని ఈ శ్లోకాలు ఈ విషయాన్ని చక్కగా వివరిస్తాయి. చితి లలితా త్రిపుర సుందరినే ప్రతిబింబిస్తోంది. **'చితిస్తత్పద లక్ష్యార్థా చిదేక రస రూపిణీ'** - అని చితియే తత్ పదార్థానికి లక్ష్యార్థం. అది చిదేక రసయే ! అన్నా ప్రజ్ఞాన ఘన స్వరూపిణీ అన్నా ఆ అర్థమే వస్తుంది.

-సశేషం

# కొటికూటేశ్వరుడు

- శ్రీ చిన్మయ రామదాసు

ఒక ఊళ్ళో ఒక శివభక్తుడైన బ్రాహ్మణోత్తముడు ఉండేవాడు. రోజూ శివలింగానికి క్షీరాభిషేకం చేసి, పూజ చేస్తేగానీ ఆహారం ముట్టుకునేవాడు కాదు. ఆ అభిషేకానికి రోజూ ఒక గొల్లవాడు శ్రద్ధగా పాలు తెచ్చి ఇచ్చేవాడు. ఇట్లా ప్రతిరోజూ ఆ బ్రాహ్మణుడు నిరాటంకంగా అభిషేకం జరుపుతూ ఉండేవాడు.

ఒక రోజు ఆ గొల్లవాడు అత్యవసర పనిమీద ఊరువెడుతూ తన కొడుకును పిలిచి, 'నాయనా! రోజూ ఉదయమే పాలు తీసుకు వెళ్ళి బ్రాహ్మణునికి శివాభిషేకం కోసం ఇచ్చిరా! మరచిపోవద్దు' అని మరీ మరీ చెప్పి ప్రయాణమయ్యాడు.

కానీ ఆ కుర్రవాడు ఆ సంగతిని మరచిపోయి పొలానికి వెళ్ళి పోయాడు. చాలా సేపు ఎదురుచూసి, ఇహ లాభం లేదని ఆ బ్రాహ్మణుడు పొలానికి పరుగెత్తుకుంటూ వచ్చి, "ఏమిరా నాయనా! ఇన్నేళ్ళ నా వ్రతాన్ని భంగం చేసేటట్లున్నావు. శివునికి అభిషేకం, పూజ చేయకపోతే నా ప్రాణాలు నిలిచేటట్లు లేవు. త్వరగా మా యింటికి పాలు తీసుకుని రా!" అని తొందరపెట్టాడు.

అభిషేకము, పూజ అనే మాటలు ఆ పిల్లవానిలో కొత్త కాంతులు తెచ్చాయి. అదేదో తాను చేయాలని నిశ్చయించుకున్నాడు. "స్వామీ! ఆ శివాభిషేకమూ, పూజ అంటే ఏమిటో, అవి ఎలా చేయాలో నాకు వివరంగా చెబితేకానీ, నేను ఇక్కడ నుండి కదలను" అని పట్టు పట్టాడు.

ఇహ ఆ బ్రాహ్మణుడు చేసేదిలేక, అక్కడే ఉన్న ఒక మేకపెంటికను తీసి, "ఇదే శివలింగం! దీని నెత్తిమీద పాలు పోయటమే శివాభిషేకం! దీని మీద పూలు వెయ్యటమే శివపూజ!" అని (తాత్కాలికంగా ఆ కుర్రవాణ్ణి సమాధాన పరచాలనే ఉద్దేశంతో) చెప్పాడు.

ఇక ఆ రోజు మొదలు రోజూ ఆ కుర్రవాడు శివాభిషేకం, పూజ శ్రద్ధగా చేయటం మొదలు పెట్టాడు. దాని వల్ల రోజూ ఇంట్లో పాలు తగ్గుతున్నాయి. అది గమనించిన అతని తల్లిదండ్రులు అతనిని గద్దించి 'పాలు ఏమౌతున్నాయి?' అని ప్రశ్నించారు. దానికి సమాధానంగా ఆ పిల్లవాడు "శివాభిషేకం, పూజ చేస్తున్నానమ్మా! మన పంతులుగారు

నాకు అవి ఎలా చేయాలో నేర్పించారు" అన్నాడు నిర్మలమైన మనస్సుతో. తండ్రి మండిపడుతూ "నీ ముఖం! అభిషేకం, పూజా! ఎక్కడ ఉందిరా శివలింగం? నాకు చూపించకపోతే, నిన్ను నరికేస్తాను! చంపేస్తాను! పాలన్నీ త్రాగేస్తూ అభిషేకమని అబద్ధం చెబుతావా?" అన్నాడు.

"యదార్థం నాన్నా! శివలింగం మన గొడ్లపాక దగ్గరే ఉంది. నాతో రండి చూపిస్తాను" అన్నాడు. అతని వెంట తల్లిదండ్రులు, చోద్యం చూడాలని చుట్టుప్రక్కల వాళ్ళు అందరూ కలసి బయలుదేరారు.

ఆశ్చర్యం!! వాళ్ళు తమ కళ్ళను తామే నమ్మలేకపోయారు. గొడ్ల పాక దగ్గర నిలువెత్తు శివలింగం కాంతులీనుతూ దర్శనమిస్తోంది! అశరీర వాణి పలికింది "ఇతను నా భక్తుడు. భక్తి ముఖ్యం కానీ, పూజాభిషేకాలు ముఖ్యం కాదు. రూపమూ నేనే! రూపాతీతుణ్ణి నేనే!!"

అక్కడున్నవారందరి నేత్రాలనుండి కన్నీరే పన్నీరై ప్రవహించి ఆ ఉద్భవ లింగాన్ని అభిషేకించింది. ఆనాటి నుండి ఆ ఈశ్వరుడికి **కాటకూటేశ్వరుడు** అనే పేరు వచ్చింది. కారణం ఆ తండ్రి పేరు **కాటుడు**, కొడుకు పేరు **కూటుడు**. అందుచేత ఆయన **కాటకూటేశ్వరుడయ్యాడు!**

## *సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి*

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఏప్రియల్ 2017, మే 2017 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

ఏప్రయల్ 2017: AS 4102, 5133, 6826, 7109, 7111, 7117, 7118, 7255,
AS 7257, 7258, 7259, 7260, 7261, 7262, 7263.

మే 2017: AS 4253, 7270 , LM 4094, 4095, 4097

– మేనేజర్

# తులసీదాస్ రామదర్శనము - గాలి జగదీశ్

తులసీదాసు మహాత్ముడు. ప్రతిరోజు స్నానం ముగించుకుని, చెంబులో మిగిలి వున్న జలము జమ్మిచెట్టుకు పోసేవాడు. ఆ జలంతో పవిత్రమైన జమ్మిచెట్టును ఆశ్రయించివున్న ఒక ప్రేతాత్మ తులసీదాసుకు కృతజ్ఞతతో నమస్కరిస్తూ "మీరు పోస్తున్న జలంతో నేను పవిత్రురాల నయ్యాను. మీరేదైనా వరం కోరుకోండి, తీరుస్తాను" అన్నది.

దానికి తులసీదాసు "నాకేమీ కోరికలు లేవు. నేను రామదర్శనం చేయాలనే కోరిక మాత్రమే వున్నది. నాకు అది చేయించు" అన్నాడు.

దానికి ప్రేతాత్మ "అది నేను చేయించలేను. కానీ నీకు ఒక వుపాయం చెబుతాను. మీరు రోజూ చేసే రామకథా గానం వినడానికి వచ్చేవారిలో ఒక వృద్ధుడు, ఒక మూల కూర్చుని, మీ రామకథా గానం వింటూ ఆనంద బాష్పాలు కారుస్తూ వుంటాడు. అతనిని మీరు వేడుకుంటే మీ కోరిక తీరుతుంది" అని చెప్పింది.

మరుసటి రోజు తులసీదాసు సభ ముగియగానే వెళ్ళి ప్రేతాత్మ చెప్పినట్లే ఆ వృద్ధుని పాదాలపై పడి తనకు రామదర్శనం చేయించమని ప్రార్థించాడు. దానికి అతడు 'సరే' అని చెప్పి "తగిన సమయం కోసం నిరీక్షించ"మని చెప్పి వెళ్ళిపోయాడు.

ఒక రోజు తులసీదాసు భగవంతుని పూజకై గంధం తీస్తున్నాడు. శ్రీరామచంద్రుడు ఒక బాలుని రూపంలో వచ్చి తులసీదాసు నుండి ఆ గంధం అడిగి తీసుకుంటాడు. కానీ తులసీదాసు గుర్తించలేదు. అప్పుడు అక్కడ చెట్టుపైనున్న ఒక రామ చిలుక ఇలా పాడుతుంది.....

"చిత్ర కూటకె ఘాట్‌పర్ భాయి సంతనకీ భీర్

తులసిదాస చందన ఘసై తిలకలేత రఘువీర్ " - పవిత్రమైన చిత్రకూట ప్రదేశంలో రాముడు బాలుని రూపంలో చందనాన్ని పుచ్చుకున్నాడు. పాపం! తులసీదాసు గ్రహించలేకున్నాడు" అని పలికింది.

ఈ విధంగా చిలుకరూపంలో పలికి, తులసీదాస్‌కి రామదర్శనం చేయించిన ఆంజనేయుడే, తులసీదాసు రామకథా గానాన్ని ఆనందంగా ఆలకించిన వృద్ధ బ్రాహ్మణుడు!

# సనత్కుమార మహర్షి

సేకరణ - మురళీ

(వార్తాలాపము నుండి)

గంగాతటమున స్వస్వరూపనిమగ్నుడై సనత్కుమార మహర్షి కూర్చుని ఉన్నాడు. ఆయన చలినుండి తనను కాపాడుకొనటానికి, చినిగి పోయిన బట్టలను, పొదల నుండి తీసిన తీగలతో, ముండ్ల సహాయంతో బొంత కుట్టుకొనటానికి ప్రయత్నిస్తున్నాడు.

ఆ మహర్షి హృదయంలో మాయా జన్య పదార్థముల యందు కోరిక ఉన్నదో లేదో పరీక్షింప దలచి విష్ణుమూర్తి ప్రత్యక్షమై వరం కోరుకో మన్నాడు. ఆ మహర్షి నిరుత్తరుడైనాడు. విష్ణుమూర్తి వరం అడగమని మరల మరల హెచ్చరించాడు.

ప్రభూ! ఈ లోకమునందు కాని, పరలోకమందుగాని ఉన్న మాయా పదార్థముల గురించి నాకేమీ కోరిక లేదు. నేను అఖండ స్వరూపానందము నందు నిమగ్నుడనై వున్నాను. అందుచేత పదార్థాభిలాషతో ఏ వరమూ కోరటం లేదు. కానీ, తమరు అమోఘ వచస్కులు. తమరి వరములు అమోఘములు. తమ వాక్కులు నిష్ఫలం కారాదు అనే భావనతో వరం కోరుతున్నాను. నేను బొంత కుట్టటానికి వుపయోగించే ఈ ముల్లు సూది అగుగాక, ఈ తీగలు దారము అగుగాక. ఈ రెండిటితో నా పని జరిగిపోతుంది. ఇది అయినా తమను సన్మానించుటకు మాత్రమే అడుగుచున్నాను" అని వినయంతో పలికాడు సనత్కుమార మహర్షి.

ఇలా విష్ణుభగవానుడే స్వయంగా వరములు ఇస్తానన్నను జ్ఞానులు ఆ పదార్థములను స్వీకరించరు. జ్ఞానికి ఆత్మనందముచే కలుగు సుఖము అనిర్వచనీయము! అపూర్వము! అమోఘము!

# అష్టాంగ యోగము

- పరాశర ప్రసాద్

పతంజలి యోగసూత్రాలలో సాధకుడు తన స్వరూప దర్శనం పొందటానికి అనుసరించవలసిన విధానాన్ని ఒక క్రమపద్ధతిలో ఎనిమిది అంగములతో కూడిన ప్రక్రియగా వర్ణించటం జరిగింది. ఆ ఎనిమిది అంగములను అష్టాంగ యోగముగా పేర్కొనబడింది. యోగము అంటే ఏమిటి? దానిని సాధించవలసిన అవసరమేమిటి? అనే విషయాన్ని సంగ్రహంగా తెలియజేయటానికే ఈ అంశం నిర్దేశింపబడినది.

దేహేంద్రియాదులు జడము. వాటికి మోక్షం అవసరం లేదు. ఆత్మ వస్తువు స్వయం ప్రకాశమైనది. కాబట్టి దానికి కూడా మోక్షం అవసరం లేదు. మరి మోక్షం దేనికి? దేహేంద్రియాదులను బాహ్య ప్రపంచంతో సంబంధం ఏర్పరచే మనస్సు నిర్విషయమవటమే మోక్షం.

మనస్సు అంతర్ముఖమై ఆత్మలో లయమవ్వటమే యోగము లేక ముక్తి. మనోలయమే ముక్తస్థితి. దానిని సాధించటానికి సాధకుడు ఆచరించే యోగసాధన ప్రక్రియ ఎనిమిది అంశములతో కూడినది. అవి 1. యమ, 2. నియమ, 3.ఆసన, 4. ప్రాణాయామ, 5. ప్రత్యాహార, 6. ధ్యాన, 7. ధారణ, 8. సమాధి.

1. యమ - సాధకుడు ముందుగా కొన్ని విధులు నియమాలు పాటించనిదే మనస్సు నియంత్రించటం అసంభవము. అందువలన ముందుగా తన ప్రవర్తనలో మార్పు తీసుకురావాలి. తన మాట ద్వారా క్రియ ద్వారా ఇతరుల మనస్సుని నొప్పించక పోవటమే యమము.

2. నియమము - అంతేకాదు. సాధకుడు తన త్రికరణములను సత్కార్యములకే వినియోగించాలి. మనస్సు, వాక్కు, కాయము అనేవి త్రికరణములు వాటిని శుద్ధిగా ఉంచుకోవాలి. త్రికరణ శుద్ధి సాధించటానికి ఒక విధానము ఉంది. మనస్సుని బోధాశ్రవణం ద్వారా, వాక్కుని నామ స్మరణ ద్వారా, కాయాన్ని పూజ ద్వారా శుద్ధి చేయవచ్చు.

3. ఆసనము - సాధకుడు సాధన ప్రక్రియలో ఏ ఆసనములో కూర్చున్నప్పటికి తన మనస్సుని స్థిరంగా ధ్యేయంపైన నిలిపి ఉంచాలి. అదే ఆసన ప్రక్రియ. దేహాన్ని నిర్ణీత ప్రదేశంలో స్థిరంగా ఉంచగలిగితే మనస్సు తప్పక స్థిరపడుతుంది.

4. ప్రాణాయామము - ప్రాణాయామ ప్రక్రియలో రేచకము, పూరకము,

కుంభకము అనే క్రియలు వున్నాయి. శ్వాసను లోపలికి తీసుకోవటము పూరకము; కొద్ది క్షణాలు నిలిపి వుంచటం కుంభకము; ఆ తరువాత శ్వాసను బయటకు వదిలి పెట్టటము రేచకము.

అయితే సాధన ప్రక్రియలో ప్రతి సాధకుడు ముందుగా ఓంకారం పూరించటం జరుగుతుంది కాబట్టి ఆ ప్రక్రియలో సహజంగా ప్రాణాయామం జరుగుతుంది. అందువలన ప్రత్యేకంగా ప్రాణాయామాన్ని చేయవలసిన అవసరం ఉండదు. ఓంకారాన్ని మనస్సు స్థిరపడేవరకు పూరిస్తే సత్ఫలితం కలుగుతుంది.

5. ప్రత్యాహారము - ప్రాణాయామ ప్రక్రియ ద్వారా ప్రత్యాహారాన్ని సాధించ గలుగుతారు. ప్రత్యాహారమంటే ఇంద్రియ నిగ్రహము. అంతరేంద్రియ నిగ్రహము శమము. బాహ్యేంద్రియ నిగ్రహము దమము. ఇంద్రియ నిగ్రహమంటే ఇంద్రియాలను బలవంతంగా అదుపుచేయటం కాదు. ఇంద్రియాలను తగు విధంగా వినియోగించుకోవాలి. దానినే ఇంద్రియ సంయమనము అనవచ్చు.

6. ధ్యానము - సాధకుడు ఒక స్థిరమైన ఆసనంలో కూర్చుని మనస్సుని నియంత్రించి, ధ్యేయంపై నిలిపి, అంతరాంతరాలలో అన్వేషిస్తూ మనస్సు యొక్క స్వస్థానము చేరటానికి చేసే ప్రయత్నమే ధ్యానము. విచారణ ద్వారా బుద్ధి సూక్ష్మగ్రాహ్యమే మనస్సులో లయమవుతుంది. అది ధ్యానము యొక్క పరాకాష్ఠ.

7. ధారణ - మనస్సు తన స్వస్థానాన్ని చేరేవరకు నిర్విరామంగా, అవిచ్ఛిన్నంగా విచారణ కొనసాగించాలి. అదే ధారణ. మనస్సుని చింతనలో ఉంచాలి. లేకపోతే చింత తప్పదు సుమా.

8. సమాధి - 'ధి' బుద్ధి సమస్థితిని పొందిన క్షణమే సమాధి. అక్కడ ద్వైతానికి తావులేదు. సంకల్ప వికల్పాలు లేవు. భావన లేదు. అభావ స్థితి. సమాధిలో అనేక దశలున్నాయి. భావ సమాధి, సవికల్పసమాధి, నిర్వికల్ప సమాధి, సహజ సమాధి అనేవి. సాధకుని మానసిక స్థితిని అనుసరించి ఉంటాయి. 'భావసమాధిని సాధించిన సాధకుడు తప్పక జన్మరాహిత్యాన్ని పొందుతాడు' అని సద్గురుదేవులు అనేకసార్లు ప్రస్తావించటం భక్తులందరకూ తెలిసిన విషయమేకదా!

(గత సంచిక తరువాయి) **యోగవాశిష్ఠము** - సుషుమ్నా ప్రసాద

## బిల్వ ఫలము యొక్క కథ

వశిష్ఠ మహర్షి యిలా కొనసాగించాడు, 'ఓరామా, నేనిప్పుడు నీకింతవరకు చెప్పని చిన్న, ఆహ్లాదమైన కథ, నీకు సందేశమిచ్చే కథను క్లుప్తంగా వివరిస్తాను, కొన్నివేల మైళ్ళ వ్యాసముగల వొకపెద్ద, అందమైన బిల్వ ఫలముండేది. దాని ప్రత్యేకత యేమిటంటే అది యెన్ని వేల కల్పాలు, యుగాలు గడిచినా తాజాగా వుంటుంది, నశించదు, దానికి తేనె లేక దివ్యామృతమునకున్న తరగని, మధుర పరిమళమున్నది. అది చాలా మృదువుగా, రుచికరంగా వుంటుంది, అది ఫలాలన్నిటిలో, వుత్తమోత్తమమైనది, అన్ని ఫలాల సారభరితమైనది యీ ఫలము, అది మంధర సర్వతమంత ధృడమైనది, స్థిరమైనది, కల్పాంతమున వచ్చే భయంకర తుఫానులు కూడ దానిని కదలించలేవు, అది రాలి నేల మీదపడదు, అదెప్పుడూ అపక్వమైన స్థితిలో వుండదు, ఆ ఫలము షడ్రసములతో కూడి, రుచికరమైనది.



ఆ ఫలంలో యెన్ని అసంఖ్యాకమైన బీజములు వున్నవో, అన్ని వేల కోట్లలోకాలు కూడ యిమిడి వున్నది. అన్ని జీవరాశులాధారానికి, పోషణకు సరిపడే మాంసము, మజ్జ అందులో వున్నాయి, ఆ అద్భుత ఫలములోని మెత్తని పదార్థము, అనంతమైన జ్ఞానము లేక స్వచ్ఛమైన తెలివి (ఎరుక) అందులోని మజ్జయే చిత్శక్తి, అది ఆకాశము, ఖాళి, కదలిక, నివాసము, న్యాయము మున్నగు వాటినన్నింటి విసర్జించింది.

రామచంద్రుడిలా మాట్లాడారు "ఓ పూజ్య గురు దేవా! మీరు చెప్పినది, అందమైన అంతరార్థమున్న కథ బిల్వ ఫలకథను, నేను చక్కగా అర్థం చేసుకొన్నాను. బిల్వ ఫలమంటే బ్రహ్మమే. అది అవినాశము, అనంతమైన సచ్చిదానంద పరమాత్మ, అది సర్వ వ్యాపకమైన పరమాత్మ లేక స్వచ్ఛమైన మేధస్సు (తెలివి). ఈ బిల్వ ఫలము యొక్క బెరడు బ్రహ్మము యొక్క అన్నిలోకాల యొక్క అండము" అంటూ వశిష్ఠుడిలా ముగించాడు, "బ్రహ్మము చాలా రుచికరమైన ఆధ్యాత్మిక ఫలము, అతను నిత్యానందము, జ్ఞానము యొక్క మిశ్రమము, ఎవరైతే యీ అద్భుత ఫలాన్ని తింటారో, వారు అమరత్వమును పొందుతారు".

## శిఖిధ్వజుని కథ

వశిష్ఠ మహర్షి, యిలా చెప్పాడు "ద్వాపర యుగంలో శిఖధ్వజుడనే రాజు మాల్యదేశములో జన్మించాడు అతను చాలా న్యాయశీలి, వుదార స్వభావుడు, సహనశీలి, ఘనత, స్థిరత్వము, సుగుణములతో, విరాజిల్లే వాడు, సౌరాష్ట్ర మహారాణి గారి కుమార్తె, చూడాల, అతని భార్య, ఆమె సహజంగా విచారణ, వివేచన శక్తి కలది తనలో తానిలా విచారణ యీ క్రింది విధముగా కొనసాగించింది.

"నేనంటే యేమిటి?", 'నేనెవరిని', నా నిజస్వభావమేమిటి? మనసులోని భ్రమ యెుక్కడ నుండి వచ్చింది. అదెవరికి చెందాలి? ఎక్కడ నుండి యెప్పుడది ప్రారంభమైనది? తన్ను చూచితాను గర్వించే యీ 'నేను'ను యెలా విధ్వంసము చేయాలి? ఈ శరీరమునకు, మనసుకు భిన్నంగా స్వతంత్రమైన, ఆ అంతిమ సత్యమేమిటి? అది మార్పులేనిది, శాశ్వతమైనది, ఆ అంతిమ సత్యాన్ని (వాస్తవాన్ని) యెలా పొందాలి? స్వేచ్ఛ అంటే యేమిటి? మాయ అంటే యేమిటి? సంసారమంటే యేమిటి? ఈ అవిద్య అను బంధము నెలా విడనాడాలి? ఏ విధంగా నిత్యానందమును, అమృతత్వమును, అత్యుత్తమైన శాంతిని పొందాలి?

ఈ శరీరము చలనరహితమైనది, పంచభూతములతో తయారయిన యీ శరీరం తుదకు నశిస్తుంది. దానికి జననము, మరణమనే ఆద్యంతములు వున్నవి, కనుక "నేను" అనే పదాన్ని శరీరమునకన్వయించకూడదు, 'నేను' అనే పదము దశేంద్రియములకు కూడ అన్వయించ కూడదు ఈ యింద్రియములు మనసు చేత చలిస్తున్నవి. అది కూడ చలన రహితమే. అది మనసుకు కూడ అన్వయించదు, ఎందుకంటే మనసు స్వయం ప్రకాశముకాదు. దానికి మొదలు, తుది వున్నది. అది తన్మాత్ర యెుక్క సాత్విక భాగముతో తయారయింది. అది బుద్ధి ప్రేరణతో, క్రియ చేస్తుంది. బుద్ధి కూడ, అహంకరాముచే శక్తిని పుంజుకొంటుంది. అందువల్ల బుద్ధి కూడ 'నేను' అనబడదు. అహంకారమును జీవుడు కదలిస్తున్నాడు కనుక జీవుడు కూడ 'నేను' కాలేడు. అది కూడ ప్రతిబింబము మాత్రమే. నీటిలోని సూర్యుని ప్రతిబింబము, నదిలోని నీరింకిపోగానే, అదృశ్యమయినట్లు, మనసనే సరస్సు యెండి పోగానే, జీవుడు అదృశ్యమైపోతాడు. మనో నిర్మూలం కావటమే, మనసనే సరస్సు యెండి పోవటం, సచ్చిదానంద స్వరూపమైన ఆత్మ లేక పరబ్రహ్మమే యీ శరీరమునకు, యింద్రియములకు, ప్రాణమునకు, మనసుకు, బుద్ధికి, జీవమునకు మూలాధారము. ఇదే సత్యమైన, అవధులు లేని "నేను" శాశ్వతమైన ఆత్మకు భిన్నముకాదు రెండూవొకటే, సచ్చిదానందమే నా సహజ స్వభావము". - సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**ఏప్రియల్ 2017**

05 బుధ - శ్రీరామనవమి - ఉదయం 5-30ని॥లకు శ్రీసద్గురు పాదపూజ, 11గం.లకు శ్రీసీతారాముల సామూహిక కళ్యాణాలు, భక్తసమారాధన

11 మంగ - పూర్ణిమ,శ్రీ సద్గురు పాద పూజ

21 శుక్ర - శ్రీ గురుదశమి- సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

25 మంగ - మాస శివరాత్రి , పావులూరులో ఏకాహం

26 బుధ - అమావాస్య

29 శని - అక్షయ తృతీయ , శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

30 ఆది - శ్రీశంకరాచార్య జయంతి, శ్రీసద్గురు ద్వా వింశతి (22వ)వార్షిక ప్రతిష్ఠా మహోత్సవము శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన.

**మే 2017**

10 బుధ - వైశాఖ పూర్ణిమ -శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన.

16 మంగ - బహుళ పంచమి - శ్రీమహాకాళికా పరమేశ్వరీ సహిత రామలింగేశ్వరస్వామివారల ప్రతిష్ఠా మహోత్సవము, లీలా కళ్యాణము.

21 ఆది - శ్రీ గురుదశమి - హనుమజ్జయంతి - సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

24 బుధ - మాస శివరాత్రి , పావులూరులో ఏకాహం.

25గురు - అమావాస్య.

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

బంధము అంటే ఏమిటి? బంధము అంటే ఈ శరీరాన్ని కట్టివేసే సంకెళ్ళు ఎంతమాత్రమూ కాదు. బంధన అనేది అంతకన్న ఎక్కువగా బాధను కలిగించేది. ఆత్మజ్ఞానాన్ని పొందకుండా చేసేది. చిత్తశాంతి లోపించటం వలన, మనస్సు యొక్క విక్షేపం వలన, ఇంద్రియాల విషయలాలసత వలన జీవునికి కలిగే పరిమిత భావన లేదా ద్వైత భావనే బంధన అనబడుతోంది.



ఇది ఆధ్యాత్మిక బంధన. దేహేంద్రియాల ద్వారా కలిగే పరిమిత భావనే బంధమని తెలుసుకున్న వారికి బంధన అనే రోగ లక్షణము అవగతమై ప్రాపంచిక విషయ ప్రభావానికి గురికాడు.

ఉపనిషత్ చాలా స్పష్టంగా చెబుతోంది'మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అని. అందువలన బంధానికి కారణం మనస్సే అని గుర్తించాలి. మానవులలో తత్త్వమందు ఆసక్తి కలవారు కొందరయితే, తర్కమందు ఆసక్తికలవారు అధికులు. అందువలన మానవుల స్వభావమే వారి బంధానికి కారణమవుతోందని స్పష్టంగా గోచరిస్తోంది.

విషయాసక్తి లేకుండా జీవితం ఎలా గడుస్తుంది? అని మానవులు అనుకుంటారు. అంతేకాదు తినటం, త్రాగటం, నిదురించటం మాత్రమే విషయాసక్తి ఎన్నడూ కాదు. కాని జీవితం అంటే ధనార్జన, మోసం చేయటం, పదవులను సంపాదించటం, కీర్తిప్రతిష్ఠలకోసం ప్రాకులాడటం మాత్రం ఎన్నడూ కాదని గుర్తించాలి.

వ్యవహార సిద్ధమైన జగత్తులో వ్యవహారం చేస్తూ జీవించే మానవులు కర్మలు చేస్తారు. చేయక తప్పదు. అయితే కర్మఫలం వారు ఆచరించే కర్మధ్యేయం మీద ఆధారపడి ఉంటుంది. అందువలన మానవులు ఆచరించే కర్మలో తత్త్వమే ధ్యేయంగా ఆచరించగలిగితే కర్మఫలం నీకు చెందదు. ఇంద్రియకర్మలన్నింటిని సాధన చతుష్టయ సంపదని ఆర్జించే విధంగా ఆచరిస్తే తప్పక ఉత్తీర్ణుడౌతాడు.

మనస్సు విషయాదుల మోహంలో ఉన్నంత వరకు బంధన తప్పదు. మనస్సులో దోషవృత్తి దాగి ఉంటుంది. సమయం వచ్చినప్పుడు అది సాధకుడిని లొంగదీస్తుంది. మనస్సులో దోషవృత్తి రహితం కావటానికి మనస్సుకి తగిన ఆహారాన్ని అందించాలి. మనస్సుకి ఆహారం గురుబోధ శ్రవణం. దానిద్వారా బుద్ధి వివేకవంతమై మనస్సులో లయమౌతుంది. దాని ద్వారా వివేకవంతమైన విచారణ మనస్సులోని దోషవృత్తిని రహితం చేస్తుంది. మనస్సు స్థిరపడాలంటే జగత్తును ఉదాసీన భావనతో చూడాలి. కార్యానికి కారణం వున్నట్లు సంకల్పానికి ఆధారము లేక ఆలంబనము వుంటుంది. దానిని తొలగిస్తే మనస్సు శాంతిస్తుంది. ఆ స్థితిలో మనస్సు తప్పక అంతర్ముఖమవుతుంది. దేహేంద్రియాలు జడము. అవి మనస్సు ఆధీనంలో ఉంటాయి. ఆత్మవస్తువుకు బంధన లేదు. బంధన మనస్సుకే. సంకల్పరహితమైన మనస్సుకు బంధన తొలగిపోతుంది.

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

ఏప్రియల్ 2017

05 బుధవారం- శ్రీరామనవమి; ఉ. 5గం. శ్రీసద్గురుపాదపూజ 11గం.లకు శ్రీసీతారాముల కళ్యాణం; పానకం వితరణ.

11 మంగళవారం - చైత్రపూర్ణిమ; రాత్రి7గం. శ్రీసద్గురుపాదపూజ.

21 శుక్రవారం - శ్రీగురుదశమి - రాత్రి7గం. శ్రీసద్గురుపాదపూజ.

30 ఆదివారం- శ్రీశంకరాచార్య జయంతి, రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ.

మే 2017

10 బుధవారం -వైశాఖ పౌర్ణమి, రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

21 ఆదివారం -శ్రీగురుదశమి- హనుమజ్జయంతి - ఉదయం 10గం.లకు ఆకుపూజ; శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

# దైవ సహాయం

- పళని

ఒక పిచ్చుక తన గ్రుడ్డును ముక్కున కరచుకుని సముద్రం మీదుగా ఎగురుతూ వెళుతోంది. ప్రమాదవశాత్తు గ్రుడ్డు జారి సముద్రంలో పడింది.

ఎలాగైనా ఆ గ్రుడ్డును బయటకు తీయాలనే పట్టుదలతో ఆ పిచ్చుక సముద్రంలో మునిగి విసుగూ విరామం లేకుండా తన ముక్కుతో జలాలను పీల్చి, ఒడ్డుకు వచ్చి రెక్కలతో విదల్చటం, ముక్కుతో బయట పోయటం చేస్తోంది.

ఆ దారిన పోతున్న నారదమహర్షి అది చూసి, విషయం అడిగి తెలుసుకుని "ఓసి వెఱ్ఱి పిచ్చుక! ఇది నీకు సాధ్యమేనా?" అని అడిగాడు.

"సాధ్యమా? అసాధ్యమా? అన్న చింత నాకు లేదు. పట్టుదలతో ప్రయత్నం చేస్తాను. ఆ పైన నాకు ఆ భగవంతుడే వున్నాడు!" అన్నది ఆ పిచ్చుక విశ్వాసంగా.

నారదుడు ఆ పిచ్చుక శ్రద్ధకూ, దీక్షకూ ఆనందించి, విష్ణులోకం వెళ్ళి గరుత్మంతుడిని పిలిచి, కథంతా వివరించి, "ఏమోయ్! నీ జాతి పక్షి అంత కష్టపడుతుంటే నీవు వూరకే వుండటం సబబేనా? సహాయ పడరాదా?" అని మందలించాడు.

గరుడుడు ఆ మాటలకు వుప్పొంగిపోయి పరుగు పరుగున భూలోకం వచ్చి, తన రెండు రెక్కలతో ఒక్కసారి విసిరితే సముద్రం నీరంతా రెండు పాయలై చెదరిపోయింది! పిచ్చుక బ్రహ్మానందంతో తన గ్రుడ్డును ముక్కున కరచుకొని వెళ్ళిపోయింది!

అదే విధంగా ఆత్మచింతన గలవారూ, సత్కార్యాచరణపరులూ, ఈ పని పెద్దదే, సహాయం లేదే మనకు సాధ్యమా? అని జంకి విడిచి పెట్టక, శ్రద్ధతో పాటుపడితే దైవసహాయం దానంతట అదే వస్తుంది.

పిచ్చుక ముక్కుతో పీల్చి బయటపోస్తేనేనా ఆ సముద్రజలం తరిగేది? గరుడుడు సహాయపడినట్లు దైవసహాయం మనకు కూడా ఒక్కసారిగా వస్తుంది.

# వ్యర్థ జీవితం

- రావి శోభ

ఒకనాడు జగద్గురు శంకరాచార్యుల వద్దకు ఒక కాపాలికుడు వచ్చి, "నీవు చాలా గొప్పవాడవని అందరూ అంటున్నారు. నీవు నాతో పోటీకి రాగలవా?" అన్నాడు.

"ముందు నీ ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శించు" అన్నారు జగద్గురు శంకరాచార్యులు.

"నేను ఆకాశంలో సంచరించగలను" అంటూ ఆ కాపాలికుడు ఆకాశంలోకి ఎగిరి చాలాసేపు అటూ ఇటూ తిరిగి క్రిందకు దిగి వచ్చాడు.

"ఈ విద్యనభ్యసించటానికి నీకు ఎంతకాలం పట్టింది?" అని ప్రశ్నించారు శ్రీశంకరులు.

"సుమారు 40 సంవత్సరాలు కృషి చేశాను" అన్నాడు కాపాలికుడు.

"దీనికోసం అంత జీవితాన్ని వ్యర్థం చేసుకున్నావా? ఏ సత్పురుషుణ్ణో దూషిస్తే, ఏ కాకి జన్మో ఎత్తి కలకాలం ఆకాశంలో ఎగర గలిగేవాడివి కదా!" అన్నారు శ్రీశంకరులు.

దానితో ఆ కాపాలికుడు సిగ్గుపడిపోయాడు.



## పాఠకులకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు

# శ్రీరాముడు మర్యాద పురుషోత్తముడు

- రమణ ప్రసాద్

శ్రీరాముడికి మర్యాద పురుషోత్తముడు అన్న బిరుదు వర్తిసుందా? వర్తించదా? అలా అయితే కైకేయి భరతునికి పట్టం కట్టాలన్నంత మాత్రాన అయోధ్యను ఎందుకు వదిలాడు? విశ్వామిత్రుని వద్ద అనేక విలువిద్యలు నేర్చిన రాముడు సూర్పణఖకు గుణపాఠం చెప్పలేకపోయాడా? సీతకోసం భీకర యుద్ధం చేసి రావణుని సంహరించిన వాడు ఎవరో ఏదో అన్నారని గర్భవతియైన సీతను అడవులకు పంపుతాడా? తన పుత్రులైన లవకుశులను చూసినప్పుడు తను చేసినది తప్పని తెలుసుకొని సీతను మన్నించమని కోరగా, ఆమె భూమాత వద్దకు చేరితే జగత్తులో ధర్మ స్థాపన చేయటానికి అవతరించిన రాముడు ఆ దుఃఖాన్ని భరించలేక సరయూనదిలో ప్రాణత్యాగం చేయటం సబబా?- అనే వాదనలు లేకపోలేదు.



**రామో విగ్రహవాన్ ధర్మః** రాముడు ధర్మానికి ప్రతీక. ఆయనలో గుణగణాలను ఎన్నలేము. ఆయన నైతిక ధర్మాలను నెరవేర్చి పురుషోత్తముడైనాడు. రాముని పవిత్రత, సత్యసంధత, ఆయన చేసిన ఘనకార్యాలు - రాముడిని అవతార పురుషుడు అని నిరూపణ చేస్తాయి. సాక్షాత్ శ్రీమహా విష్ణువే దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం శ్రీరాముడిగా అవతరించాడని నమ్మినవారు పైన చేయబడిన అభియోగాలను త్రోసిపుచ్చుతారు. తన తండ్రికి ఇచ్చిన మాటకోసం పధ్నాల్గేళ్ళు అరణ్యవాసానికి వెళ్ళి పితృ వాక్య పరిపాలన చేసిని ధర్మమూర్తి. రాజులకు అనేక భార్యలు ఉండటం ధర్మవిరుద్ధం కాదు. అయినా శ్రీరాముడు ఏకపత్నీ వ్రతుడుగా నిలిచాడు. తన తండ్రి కైకేయికి ఇచ్చిన మాటను నిలబెట్టటం కోసమే అడవికి వెళ్ళాడు. కుల విచక్షణ చేయక గుహునివంటి భిల్లునితో, వానరుడైన సుగ్రీవునితో, మైత్రి నెరపాడు.

రావణుని తమ్ముడైన విభీషణునికి శరణు ఒసగి రావణ వధకుపూర్వమే లంకకు రాజుగా పట్టాభిషిక్తునిగా చేశాడు.

అయితే దేహత్యాగం ఎందుకు చేశాడు అంటే వసిష్ఠమహర్షి వచ్చి "నీ అవతార సమాప్తి సమయం వచ్చింది. నువ్వు వైకుంఠానికి చేరుకో"మన్న తరువాత దేహత్యాగం చేశాడు. అంతకు ముందే లక్ష్మణుడు దేహత్యాగం చేసి శేషుడిగా వైకుంఠంలో వేచి ఉన్నాడు. శ్రీరామునిలో మానవత మూర్తీభవించి ఉండటం చేత మర్యాద పురుషుడనిపించుకున్నాడు.

శ్రీరామచంద్రుడు మనందరికీ ఆదర్శ పురుషుడు. ఆయన వ్యక్తిత్వంలోని, మూర్తిత్వంలోని సుగుణాలను మనలో ప్రతి ఒక్కరం తెలిసికోవాలి. '**సచ నిత్యం ప్రశాంతాత్మా**'అంటే - 'ఆ రాముడు ఎప్పుడూ తన ప్రశాంతతను పోగొట్టుకోడు' అంటాడు వాల్మీకి.

సర్వావస్థలలోనూ సానుకూల దృక్పథం - పట్టాభిషేకవార్త విన్నప్పుడు రాముడు సంతోషంతో పొంగిపోలేదు. పద్నాలుగు ఏళ్ల అరణ్యవాసం చెయ్యాలన్నప్పుడు దుఃఖంతో క్రుంగిపోలేదు. రామ రావణయుద్ధంలో ఒకనాడు రావణుని రథికుడిని,రథాన్ని, గుఱ్ఱాలను, అతడి అస్త్ర శస్త్రాలను ఖండిస్తాడు. నిర్వీర్యుడిగా నుంచున్న రావణునితో, రావణా! ఇంటికి వెళ్ళు. రేపు సైన్య సమేతంగా రా !అని ఉదారత చూపించాడు.

ప్రజా సంక్షేమమే తన ప్రథమ కర్తవ్యంగా భావించాడు. భరతుడు రాముణ్ణి ఎలాగైనా ఒప్పించి తిరిగి అయోధ్యకు తీసికొని వెళ్ళాలని వచ్చినప్పుడు, రాముడు మొట్టమొదట అయోధ్య ప్రజల క్షేమ సమాచారాన్ని తెలుసుకున్నాడు.

**స్నేహం దయాం చ సౌఖ్యం చ యది జానకీ వా జానకీమపి ।**

**ఆరాధనాయ లోకస్య ముంచ తో నాస్తి మే వ్యథా ॥**

'ప్రజల సంక్షేమానికై స్వీయ సుఖాలను, మమతానురాగాలను, చివరికి నా భార్య అయిన సీతను సైతం విడిచిపెట్టటానికి సంకోచించను' అని ప్రజా క్షేమమే ప్రథమ కర్తవ్యమని నిరూపించాడు.

అందువల్ల రాముడు మర్యాద పురుషోత్తముడు అయ్యాడు.

# శ్రీకృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

ద్వితీయాశ్వాసము 55వ శ్లో॥

**ఉపసతా మాత్మవిదః పురాణాః**
**పరం పుమాంసం నిహితం గుహాయామ్।**
**వయం యశోదా శిశు బాలలీలా।**
**కథాసుధ సిన్ధుషు లీలయామః ॥**

తాత్పర్యము -



పుణ్యులైన, బ్రహ్మవేత్తలైన మునులు తమ దహరాకాశ గుహయందు ఉంచబడిన పరమ పురుషుని ధ్యానింతురు గాక!

మేము మాత్రము యశోద కొడుకు యొక్క బాల్య విలాస కథలను అమృత సముద్రము నందు విహారము సల్పెదము. అంతగా సాధన సల్పలేని మేము, మా బుల్లి కృష్ణుని లీలా విలాస కథలను అమృతసాగరంలో సల్పే విహారమే చాలు మాకు! అదే ముక్తికి మార్గము!!

ద్వితీయా శ్వాసము 59 వ శ్లో॥

**శమ్భో స్వాగతామిత ఇతో వామేన పద్మాసన।**
**క్రౌఞ్చారే కుశలం సుఖం సురపతే విత్తేశనో దృశ్యతే।**
**ఇత్థం స్వప్నగతస్య కైటభజిత శ్శృత్వా యశోదా గిరః।**
**కింకిం బాలక జల్పసీతి రచితం ధూధూ కృతం పాతు నః ॥**

తాత్పర్యము -

"ఓ ఈశ్వరా! స్వాగతం! సుఖంగా వచ్చితివా? బ్రహ్మా! ఇటుల యెడమ ప్రక్కన కూర్చుండుము. కుమారా! క్షేమమా? ఇంద్రా! సుఖము గలదా? కుబేరా! మా చేత చూడబడవూ?".... ఈలాగున నిద్రించుచున్న శ్రీకృష్ణుని యొక్క కలవరింత మాటలకు యశోద "ఓ కుఱ్ఱా! ఏమేమో పలవరించెదవు?" అని పీడాపనోదకమైన ధూ ధూ అను నిష్ఠీవనము (ఉమ్మి) మిమ్ము రక్షించుగాక!

# తత్త్వం తెలుసుకుందాం -రమణ ప్రసాద్

పూజ్య శ్రీ దండి నిర్మలానందగిరిగారు 'అపరోక్షానుభూతి' అనే విషయం పైన ప్రసంగిస్తూ, "జ్ఞానం మూడు విధాలు- ప్రత్యక్షం; పరోక్షం; అపరోక్షం అని. ప్రత్యక్షజ్ఞానానికి శాస్త్రాలు అక్కరలేదు. అది ఇంద్రియాల ద్వారా తెలియబడుతుంది. పరోక్షజ్ఞానం కనపడదు, భగవంతుడు వున్నాడని తెలుస్తుంది. ఇది శాస్త్రాల ద్వారా కలుగుతుంది, సద్గురువులవల్ల కలుగుతుంది. అపరోక్షజ్ఞానం. దీనికి శాస్త్రాలు అవసరం లేదు. గురువు అవసరం లేదు. "నువ్వు ఉన్నావా లేదా" అంటే "నేను ఉన్నాను" అనే జ్ఞానమే అపరోక్షజ్ఞానం.

శ్రీ శంకరులు తమ జీవితంలో చిట్టచవరి కాలంలో రచించిన "అపరోక్షానుభూతి" అనే గ్రంథంలో నాలుగు విషయాలు చెప్పారు: 1. ఆత్మ విచారణ - ఈ ఆత్మ ఏద్దై ఉన్నది?జీవుడు ఎవరు? బ్రహ్మ అంటే ఏమిటి' దానిని పొందటం ఎలా అనే విషయాలపైన విచారణ, 2. ఈదేహం ఆత్మ కాదు అని తెలిసికొని ఆ భ్రాంతిని తొలగించుకొనే మార్గం, 3.ఆత్మ కంటెవేరైనది ఏదీ లేదు అని తెలిసికోవటం; 4.ఆత్మే 'తాను' అనే దృఢానుభూతి కలిగి ఉండటం.

నిర్మల జ్ఞానం పొందాలంటే లయ విక్షేపావస్థలు రెండూ తొలగిపోవాలి. మలదోషాన్ని(పాపదోషాన్ని), విక్షేపదోషాన్ని(చంచలత్వం అనే దోషాన్ని) తొలగించుకోనిదే బ్రహ్మానుభూతి కలుగదు. సద్గురువు తన జ్ఞానామృతాన్ని మన వీనుల నింపి సూక్ష్మ శరీరాన్ని (లింగ శరీరాన్ని) జ్ఞానమయం చేస్తాడు. వారి వద్ద మాయకు స్థానం ఉండదు. 'నా గురువు ఇంద్రియాలను తమ తమ పనులను చేయుమని శాసించేవాడు, నిర్వికారుడు, హృస్సన్నివిష్ఠుడు అని దృఢంగా నమ్మాలి. మానవునికి దృఢాపరోక్షజ్ఞానం కలగాలంటే గురుబోధా శ్రవణం చేయాలి. ఎంతవరకు? అంటే, 'మనస్సు లేకుండా పోయేవరకు' అన్నారు శ్రీ రమణ మహర్షి. అప్పుడు జీవన్ముక్తి కలుగుతుంది.

**అపరోక్షానుభూతిర్వై ప్రోచ్యతే మోక్ష సిద్ధయే।**

**సద్భిరేవ ప్రయత్నేన వీక్షణయా ముహుర్ముహుః॥**

'మోక్షగామి ప్రయత్న పూర్వకంగా శ్రవణం మననం చేసి నిదిధ్యాసకు తెచ్చుకోవాలి. **వీక్షణయా ముహుర్ముహుః** నీ మనస్సును మాటి మాటికి బ్రహ్మము పైన నిలపాలి.

అపరోక్షానుభూతి ప్రయోజనం ఏమిటి? అంటే మోక్షం - అనగా బ్రతికి ఉండగానే ముక్తి. మహాత్ములు ఆ స్థితిని పొందినవారు. వారికి శరీరంతో సంబంధం లేదు. అతడు తిన్నా తిననివాడే! విన్నా విననివాడే! అతడే ముక్త పురుషుడు. పూజ్య శ్రీ దండి నిర్మలానంద స్వాముల వారు తమ ఉపన్యాసాన్ని కొనసాగిస్తూ, 'జగమే మాయ, బ్రతుకే మాయ' అనే పాటలో వేదాంత తత్త్వమంతా ఇమిడి ఉన్నదని చెప్పారు. 'ఈ ప్రపంచం మాయ.జనన మరణాలతో కూడినది ఈ జీవితం ఒకమాయ. అదే వేదాల సారం' అంటాడు రచయిత. దీనినే శ్రీ శంకర భగవత్పాదాచార్యులవారు, "**శ్లోకార్ధేన ప్రవక్ష్యామి యదుక్తం గ్రంతకోటిభిః।, బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవనాZపరః॥**" అన్నారు.

'కలిమి లేములు,కష్ట సుఖాలు కావడిలో కుండల వంటివి. తరటి చూస్తే,కావడి కొయ్యే! కుండలు మన్నే! ; ఆశా మోహాలను దరికి రానీయకుండా, ఇతరుల సౌఖ్యం కోసం పాటు పడేవాడే బ్రహ్మానందాన్ని పొందగలుగుతాడు' అంటాడు రచయిత. ఈ విషయాన్నే శ్రీ శంకరులు తెలియజేశారు: కావడి, కుర్చీలు, బల్లలు విడి విడిగా ఉన్నా అది కొయ్యే కదా! ఆ విధంగానే కుండలు, కూజాలు, విడి విడిగా తోచినా దానికి ఆధారం మట్టే కదా. మూఢులు అజ్ఞానం చేత దేహాన్ని ఆత్మ అనుకొంటున్నారు.

**ఘటత్వేన యథా పృధ్వీ పటత్వేనైవ తన్తవః।**
**వినిర్ణీతా విమూఢేన దేహత్వేన తథాత్మతా॥** (శ్లో॥71- అపరోక్షానుభూతి)

'మట్టి లేనిదే కుండ లేదు.కాబట్టి మట్టి కంటె కుండ వేరు కాదు. కుండను మట్టి అనుకోవటమే యదార్థము. ఎందుకనగా మట్టి లేకపోతే కుండ లేదుకదా.. అలాగే వస్త్రము దారములే అని తెలియటం యదార్థము. ఎందుకంటే దారములకంటే వస్త్రము వేరుగా లేదు. అందువలన ఆత్మను దేహం అనుకోవటం అజ్ఞానం. ఉన్నది ఆత్మే అని గ్రహించటం జ్ఞానము

**ఏవమాత్మన్య విద్యాతో దేహాధ్యాసో హి జాయతే।**
**సఏవాత్మా పరిజ్ఞాతో లీయతే చ పరాత్మని॥** (శ్లో॥84- అపరోక్షానుభూతి)

'ఆత్మను ఆవరించిన అజ్ఞానం చేత దేహధ్యాస అనగా ఆత్మయే దేహమనే భ్రమ కలుగుతోంది. ఒక వస్తువు చీకటిలో ఉంటే తెలుసుకోలేము. వెలుతురుతోనే ఆ వస్తువు తెలియబడుతుంది. ఆత్మపైన అజ్ఞానం పోవాలంటే ఆత్మ సాక్షాత్కారం ఆవసరం.'

ఈ సత్యం సద్గురు సమాశ్రయంచేత తెలియబడుతుంది. అప్పుడు ఆత్మ సాక్షాత్కారం అదే బ్రహ్మ సాక్షాత్కారం కలుగుతుంది.

# ఎవరికి నేస్తం ఎవరు?

-శ్రీ జ్ఞానానంద స్వామి

పూర్వం ఒకప్పుడు సూరసేన రాజ్యాన్ని చిత్రకేతుడనే మహారాజు పరిపాలించే వాడు. అతడి పాలనలో రాజ్యం సస్యశ్యామలంగా ఉండేది. చిత్రకేతుడికి ఎందరో భార్యలున్నప్పటికీ సంతాన భాగ్యానికి అతడు నోచుకోలేదు. సర్వగుణ, ఐశ్వర్య సంపన్నుడై వుండీ, పుత్రులు లేరనే బాధ అతనిని అమితంగా బాధించసాగింది.

ఇలా వుండగా ఒకసారి అంగీరసముని చిత్రకేతుడి ఆస్థానానికి విచ్చేశాడు. అర్ఘ్యపాద్యాదులతో ఆయనకు సముచితంగా మర్యాదలు చేశాడు రాజు. కుశల ప్రశ్నల తరువాత చిత్రకేతుడు వినమ్రతతో "తపో జ్ఞాన సమాధుల వలన పరిశుద్ధాంతఃకరణ కలిగిన తమబోటి యోగి పుంగవులకు తెలియనిదేమున్నది స్వామీ! అయినా తమరు అడిగారు కనుక చెప్పటం నా కర్తవ్యం. సకల సౌభాగ్యాలూ ఉండి కూడా, పుత్ర భాగ్యానికి మాత్రం నేను నోచుకోలేదు. దయతో తమరు నాకు పుత్ర ప్రాప్తి కలిగే మార్గం చూపండి" అన్నాడు.

రాజు ఆవేదనకు అంగీరసుడి మనస్సు కరిగిపోయింది. వెంటనే చిత్రకేతుని చేత పుత్రకామేష్ఠి యాగం జరిపించాడు. పిమ్మట "రాజా! నీకు త్వరలో ఒక పుత్రుడు కలుగుతాడు! పుట్టబోయే ఆ కుమారుడే నీ సుఖదుఃఖాలకు కారకుడుగా ఉంటాడు" అని ఆశీర్వదించి, హెచ్చరిక కూడా చేసివెళ్ళాడు. కొంతకాలానికి పట్టమహిషి కృతద్యుతి ద్వారా బిడ్డ కలిగాడు. చిత్రకేతుని ఆనందానికి మేర లేకపోయింది. వెంటనే రాజ్యం అంతా ఈ శుభవార్త చాటింపు వేయించి, ఉత్సవాలు జరిపించాడు.

ఈ పుత్రోత్సాహంతో మిగతా భార్యలను ఉదాసీన పరచాడు. ఎప్పుడూ తన పట్టమహిషి అంతఃపురంలోనే కాలం గడుపసాగాడు. అది క్రమంగా తక్కిన రాణులలో అసూయ కలిగించింది. పుట్టిన బిడ్డ మీద కోపంగా పరిణమించింది. 'ఈ బిడ్డ కారణంగా మనలందరినీ చిన్న చూపు చూస్తున్నాడు. ఈతనిని విషం త్రాగించి చంపించాల'ని నిర్ణయించి తక్కిన రాణులందరూ కలసి తీర్మానించారు. ఆ ఆలోచన మేరకు ఒకరోజు ఆ పసివాని చేత విషం త్రాగించారు. ఆ బాలుడు వెంటనే మరణించాడు.

వంశాకురం మరణించాడన్న వార్త వినగానే చిత్రకేతుకు పిచ్చి ఎక్కినంత పనైంది. భార్యాభర్తలిరువురూ శోకసాగరంలో మునిగి పోయారు. సరిగా అదే సమయంలో నారద మహర్షి అక్కడకు వచ్చాడు.

"రాజా! కాల ప్రవాహంలో దేహులు సంయోగ వియోగాలు చెందుతుంటారు. వారికోసం నువ్వు ఇలా విలపించటం తగదు. నశించే ఈ పాంచభౌతిక దేహం శాశ్వతంకాదు. ఆ భగవంతుణ్ణి చేరుకునే మార్గాన్ని నీకు బోధిస్తాను......" అంటూ నారదుడు ఎన్నో విధాల చెప్పి చూశాడు. ప్రయోజనం లేకపోయింది.

అప్పుడు నారదుడు ఒక అద్భుతం చేశాడు. తన తపోమహిమతో ఆ శిశువు శరీరం నుండి నిష్క్రమించిన జీవాత్మను రప్పించి, దాన్ని వుద్దేశించి ఇలా అన్నాడు "ఓ జీవాత్మా! ఇలా చూడు. నీ తల్లిదండ్రులు నువ్వు ఈ శరీరాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోయావని ఎంతగానో దుఃఖిస్తున్నారు. నువ్వు మళ్ళీ ఈ మృతదేహంలో ప్రవేశించి, రాజ భోగాలు అనుభవించి వారిని సంతోషపెట్టు."

ఆ మాటలు వినగానే ఆ జీవాత్మ నారదునితో "మహర్షీ! నేను కర్మానుసారం 84లక్షల జీవరాసులలోనూ మళ్ళీ మళ్ళీ జన్మలను ఎత్తుతూ ఉన్నాను. ఇక ఏ జన్మలో నాకు వీళ్ళు తల్లిదండ్రులుగా ఉన్నారో ఎవరికి తెలుసు? ఇట్టి జన్మ పరంపరలో ఒకరు మరొకరికి బంధువుగాను, విరోధిగాను, మిత్రుడుగాను ఉండి ఉండవచ్చు.

బంగారు ఆభరణాలు క్రయ విక్రయాలలో ఎలా చేతులు మారుతాయో, అదేమాదిరి జీవుడు నిత్యశుద్ధ ముక్త స్వభావుడు. ఈశ్వరాంశం. ఇట్టి ఆత్మకు ప్రియుడూ, అప్రియుడూ, ఇరుగు పొరుగు వారనే భావం ఉండదు. గుణదోష కర్తృత్వంతో సాక్షిమాత్రుడుగా ఉంటాడు. ఎలాటి కర్మఫలాలనూ స్వీకరించడు. సుఖదుఃఖాలలో పాల్గొనడు" అని చెప్పి ఆ జీవాత్మ నారదమహర్షి వద్ద సెలవు పుచ్చుకుని వెళ్ళిపోయింది.

ఈ అద్భుత సంభాషణ ఆలకిస్తున్న చిత్రకేతునకు అప్పటికి జ్ఞానోదయం అయింది. నారదమహర్షి గావించిన ఉపదేశానుసారం అతడు కఠోర సాధనలు ఆచరించి చివరకు భగవంతుని పాదారవిందాలను పొందగలిగాడు.

(గత సంచిక తరువాయి) # విశ్వామిత్రుడు - రమణ ప్రసాద్

విశ్వామిత్రుడు కరుణిస్తే గడ్డి పరకను మేరువు చేయగలడు. కోపిస్తే, మేరువును గడ్డి పరకను చేయగలడు. త్రిశంకుని కటాక్షించి అతని కోసం స్వర్గాన్ని సృష్టించాడు. కోపంతో హరిశ్చంద్రుని అనేక కష్టాల పాలు చేశాడు. కాని విశ్వామిత్రుడే లేకుంటే హరిశ్చంద్రుడు నిత్య సత్య వ్రతుడని లోకానికి తెలిసేదా? హరిశ్చంద్రుడిచేత అసత్యమాడించాలని అతని రాజ్యాన్ని గ్రహించి, అతడిని నగరంనుండి బయటకు త్రోయించాడు. హరిశ్చంద్రుడు తన భార్యాపుత్రులను ఆఖరికి తనను అమ్ముకొనేటట్లు చేసినా అతడు అసత్యమాడని కారణంగా బ్రహ్మాది దేవతలు ప్రత్యక్షమై పూర్వ రాజ్యాన్ని ఇప్పించి అనేక వరాలు ఇచ్చారు. " అతని కీర్తి దిగంతముల వ్యాపింపచేయటానికే నేను అలా చేశాను" అని హరిశ్చంద్రుడిని కీర్తించి, విశ్వామిత్రుడు అనేక వరాలను ప్రసాదించాడు.



విశ్వామిత్రుడు రామ లక్ష్మణుల కీర్తి చంద్రికలను వ్యాపింప జేయటానికి, తాను తలపెట్టిన యాగాన్ని మారీచ, సుబాహులు, తాటక మొదలైన రాక్షసులను వినాశం చేయటానికి అయోధ్యకు వెళ్ళి రామలక్ష్మణులను తనతో పంపమని దశరథుడిని కోరాడు. దారిలో వారికి అనేక శస్త్రాస్త్ర విద్యలను నేర్పించాడు. వారిచేత రాక్షస వధ చేయించి, శ్రీరాముని పాద రజంతో అహల్య శాపమోక్షానికి నిమిత్తమాత్రుడైనాడు. రామ లక్ష్మణులను మిథిలాపురానికి తీసికొని వెళ్ళి, జనకుని సభలో శివధనుర్భంగం శ్రీరాముని చేత చేయించి సీతారాముల వివాహమే గాక,ఉర్మిళా, మాండవీ, శృతకీర్తులను రప్పించి లక్ష్మణ, భరత, శత్రుఘ్నులకు వివాహం చేయించాడు. రామ లక్ష్మణులు విష్ణుమూర్తి అవతారములు, కారణజన్ములు అని తెలిసినవాడై వారి కీర్తి చంద్రికలు దిగంతాల వ్యాపింపజేశాడు.

విశ్వామిత్రుడు స్మృతి కర్త. వేద విదులైన ఆర్యులచేత ఆచరింపబడి ప్రశంసించబడినదే ధర్మము అని ఆయన తెలిపాడు. స్వర్థ చేతను బ్రహ్మర్షి పదవినిపొంది, బ్రహ్మ సృష్టికి ప్రతి సృష్ఠి చేసి , చండ శాసనుడని పిలువబడిన కౌశిక మహర్షి సప్తర్షిగణములలో నొకడై ప్రసిద్ధి పొందాడు.

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి)

- విజయేశ్వరానంద ప్రసాద్

**కవిగారు - పోతునూరు**

ఇంగ్లీషులో »»Marriages are made in Heaven"అనే ఒక నానుడి ఉంది. వివాహ సంబంధాలను భగవంతుడు స్వర్గంలోనే నిర్ణయించి ఉంచుతాడు" అని దాని అర్థం. మరి ఆ భగవంతుడు ఎక్కడో స్వర్గంలో కాకుండా, మన యింటికే దిగివచ్చి మన బిడ్డల వివాహ సంబంధాలు తాను నిర్ణయించటమేగాక, స్వయంగా జరిపించటం ఎంత అరుదైన భాగ్యము! ఆ భాగ్యము శ్రీబాబును నమ్ముకొన్న భక్తుల సొమ్ము. కన్న తల్లిదండ్రుల కంటే ఎక్కువ బాధ్యతను తీసికొని, ఉభయుల శ్రేయస్సును ఆకాంక్షించి,యిరుపక్షాల వారితోను మాట్లాడి, వాళ్ళు ఒకళ్ళ మీద ఒకళ్ళు విసురుకునే విసుర్లు తమకుకూడా తగులుతున్నా సహించి, కయ్యం మానిపించి, నెయ్యం కుదిర్చి, వియ్యం జరిపి, నూతన వధూవరులిద్దరికీ ఆదర్శ గృహస్థాశ్రమ ధర్మాలను చక్కగా బోధించి, ఆశీర్వచన శుభాక్షతలను వేసేవరకు శ్రీబాబు విశ్రాంతి తీసుకునేవారు కాదు. ఇదంతా గమనించే కొందరు "పెళ్ళిళ్ళ పేరయ్య" అని కూడ శ్రీబాబును అనేవారు. వాళ్ళు తెలిసి అన్నా , తెలియక అన్నా ఆ మాట సత్యమే. ఎందుకంటే, శ్రీబాబు యిలా వధూవరులను కలిపే కళ్యాణాలతో ఊరుకొనక, సర్వ బంధ రహితమైన శాశ్వత బంధాన్ని అనుసంధించి జీవాత్మ పరమాత్మలను కలిపే నిత్యకళ్యాణ స్వరూపులు గదా!



భీమవరం భక్తులు తనికెళ్ళ చలపతిగారి కుటుంబాన్ని, కవిగారి కుటుంబాన్ని వియ్యంద్వారా కలపాలని శ్రీబాబు నిశ్చయించారు. చలపతిగారి పెద్ద కుమారుడు మోహన్ లెనిన్‌తో, కవిగారి రెండవ

కుమార్తె వేణమ్మ వివాహం 1957లో జరిపించారు శ్రీ బాబు. చదువు పూర్తి అయ్యేవరకు పెళ్ళి చేసుకోనని మోహన్! అసలు వివాహమే చేసుకోకుండా గురుసేవలోనే జీవితం సార్థకం చేసుకుంటానని వేణమ్మ! ఎవరికి చెప్పవలసిన రీతిలో వారికి చెప్పి ఒప్పించారు శ్రీబాబు. "ఇద్దరికి కావలసిన వాడను నేనున్నాను గదా! మాటిమాటికి మీరున్న చోటికి వచ్చి, మీరు కోరినన్నాళ్ళు మీతో ఉండి మీకు సంతోషాన్ని కలిగిస్తూ ఉంటాను." అని అభయమిచ్చారు. వివాహం జరిగిన ఏడాది లోపుననే వారికి ఒక అద్భుతమైన సంఘటన ద్వారా తమ సర్వ వ్యాపకత్వాన్ని గుర్తించగల తిరుగులేని అనుభవం అందించారు.

1958లో లెనిన్ నరసాపురంలో వేణమ్మతో కాపురం ఉంటూ ఉద్యోగం చేస్తున్నాడు. శ్రీ బాబుకు అప్పటికే అత్యంత సన్నిహితులైన భక్తులు విశ్వనాధంగారు, కనకమ్మగారు (దంపతులు) వారింటికి ప్రక్కనే వుంటున్నారు. ఎంతో అన్యోన్యంగా రెండు కుటుంబాలవారు గురుదేవుని దివ్యలీలలు వర్ణించుకుంటూ ఉండేవారు.శ్రీబాబు చాలా తరచుగా విశ్వనాధంగారింటికి పూజాపీఠంతో సహా వస్తూ ఉండేవారు. కొన్నిరోజులుండేవారు. ఎంతో ఆనందాన్ని వాళ్ళకు అందించేవారు.

దీపావళి పండుగ వచ్చింది. వేణమ్మ తల్లిగారు కూతురిని, అల్లుణ్ణి పండుగకు తీసికొని వెళ్ళాలని వచ్చారు. మోహన్ ఆఫీసు పనుల వలన ఆగిపోయి వేణమ్మను పంపాడు. దీపావళి పండుగ నాటికి శ్రీబాబు నరసాపురం వచ్చారు. అక్కడ విశ్వనాధంగారి కుటుంబంతోను, మోహన్ లెనిన్‌తోను కలిసి శ్రీబాబు టపాకాయలు కాలుస్తూ, ఔట్లు పేల్చిస్తూ రాత్రి ఒంటిగంటవరకు ఎంతో సరదాగా గడిపారు. మరునాడు లెనిన్ ఆ విషయాలన్నింటిని అతి వివరంగా వేణమ్మకు తెలుపుతూ "నువ్వు కూడా ఉండి ఉంటే ఈ ఆనందమంతా పొందేదానివి. అక్కడకు వెళ్ళి, ఈ అదృష్టాన్ని కోల్పోయావు" అని ఉడికిస్తూ ఉత్తరం వ్రాశాడు.

- సశేషం

# విష్ణు కథలు

-గత సంచిక తరువాయి

## మీరాబాయి

- రమణ ప్రసాద్

### భక్తి పరాకాష్ఠ:

మీరా తనకు వచ్చిన గడ్డు పరిస్థితులను లెక్కచేయక నిరంతరం శ్యామసుందరుడినే తలుస్తూ, తన కష్టాలను ఆ గిరిధరునితోనే విన్నవించుకుంటూ, కృష్ణుడినే మదిలో నిలుపుకొని కృష్ణదర్శనానికై పరితపిస్తూ ఉండేది. గిరిధర గోపాలుడే ఆమె సర్వస్వం. ఆ స్వామియే మీరా తల్లికి సర్వ ప్రపంచము. ఆ భక్తి పారవశ్యం పరాకాష్టకు చేరుకుని ఆమె తన భక్తిని కీర్తనల రూపంలో తన స్వామికి విన్నవించుకుంది.



పలక న లాగే శ్యామ్ బినా॥

హరిబిను మధురా ఐసోలాగే, శసి బిను రైన్ అంధేరీ

పాత్‌పాత్ బృందావన్ ఢూండ్యో, కుంజ్ కుంజ్ బ్రజ కేరీ

ఊంచే ఊంచే యమునానగరీ, తలై బహై జమునా గహరీ

మీరాకే ప్రభు గిరిధర్ నగర్, హరిచరణన్‌కీ చేరీ॥

"శ్యామ సుందరా! నీకై ఎదురుచూసి చూసి నా కన్నులు కాయలు కాశాయి. హరిలేని మధుర, చంద్రుడు లేని తారలు నిరర్థకం కదా! నిన్ను ప్రతిచోట, ప్రతి ఆకులోను వెతికాను. కానీ నీ జాడ తెలియలేదు. ఎత్తుగా మధురా నగరి, అడుగున ప్రవహిస్తున్న లోతైన యమునా నదీతీరంలో అంతటా వెతికాను కానీ నీజాడలేదు. నీ సఖినైన నాకు దర్శనం ఇయ్యి ప్రభూ!" అని పాడుకుంది.

ఆమె ధ్యాసంతా శ్రీకృష్ణునిపైననే, "నాప్రభువు ఆర్తత్రాణ పరాయణుడు. ఆశ్రయించిన వారినెందరినో రక్షించాడు. నరహరి

రూపం దాల్చి హిరణ్యకశిపుని సంహరించి, ప్రహ్లాదుని రక్షించలేదా? గజరాజును రక్షించి నీటినుండి బయటకు తేలేదా? కృష్ణుడి చరణాల చెంత పడి ఉన్న నన్ను అతడు రక్షించడా?"

భర్త మరణం తరువాత మీరా శ్రీకృష్ణ మందిరం విడిచి బయటకు ఎక్కువగా వచ్చేది కాదు. చిన్న చప్పుడైనా శ్రీకృష్ణుడు వచ్చినట్లు భావించేది.

ఆవేశంలో దట్టమైన మేఘాలను చూసి
బాదల్ దేఖ్‌డరీహెూ శ్యామ్! మైబాదల్ దేఖ్‌డరీ॥
కాలీ పీలీఘటా ఊబడీ, బరసో ఏక్ ఘడీ।
జిత్ జావో తిత్ పానీ, హుయీ సబ్ హెూమ్‌హడీ॥
జాకె పియా పరదేశ్ బసతహై, నీచే బాహర్ ఖడీ।
మీరాకే ప్రభు హరి అవినాశీ, కీజో ప్రీత్ ఖరీ॥

"దట్టంగా మేఘాలు కమ్ముకున్నాయి. జోరుగా వర్షంపడి ఎక్కడ చూసినా వర్షపు నీరు నిండి, వాతావరణం భీభత్సంగా ఉండి భయంవేస్తోంది. నా ప్రియ సఖుడు ఇక్కడ లేడు. పరదేశంలో ఉన్నాడు. లోపలకీ బయటకీ వెళ్తూ, వస్తూ నా ప్రియుని కోసం ఎదురుచూస్తూ ఉంటాను. నాప్రభువు తప్పక వస్తాడు. తన ప్రేమను నాకు అందిస్తాడు. నేను ఎందుకు భయపడాలి?" అని తనకు తనే సమాధానం చెప్పకొంది.

మీరా ఎప్పడూ, కృష్ణుడినే తలుస్తూ, కృష్ణ స్మరణతో ఉంటూ కీర్తనలు పాడేది. అలా జాలువారిన కీర్తనలలో, మేలుకొలుపు, ప్రార్థన, విరహం, ప్రేమాలాపం, తత్త్వం, నామ మహిమ, గురు మహిమ, ఉపదేశాత్మకం, దర్శనానందం మొదలైన భావాలు కానవస్తాయి. మీరా కీర్తనలలోని భక్తితత్త్వాన్ని ఆస్వాదించాలంటే, భక్తి పారవశ్యంలో ఆమె పాడిన కీర్తనలను శ్రవణం చేసి మననం చేయాలి. అలాచేస్తే, మన మనస్సు ఆ భావంలో ఉండిపోయి ఆ భావంలో ఉన్న మనస్సు భగవంతునిలో లయించి పోతుంది

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL